
Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 13.02.2015, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 37 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# చిమ్మేసాడు




తొమ్మిది నెలల క్రితం భారత పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో ఓ ఛాయ్ వాలా చరిత్ర సృష్టించాడు. అంతా తానే అయ్యి నిర్వహించిన ఆ ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణమైన మెజార్టీని సాధించిన నరేంద్ర మోడీ ప్రధాని పీఠాన్ని అధిరోహించాడు. ఓ ఛాయ్‌వాలాగా ఆరోజు మోడీ ఆ ఘనత సాధిస్తే, ఆ మోడీ ఇమేజ్‌ను అడ్డుకుని, దేశ వ్యాప్తంగా వీస్తున్న అతని పెనుగాలికి ఎదురొడ్డి నిలిచిన ఓ మధ్యతరగతి సామాన్యుడిగా అరవింద్ కేజ్రీవాల్ ఈరోజు ఢిల్లీ రాష్ట్ర ముఖ్యమంత్రి సింహాసనాన్ని అధిష్టించబోతున్నాడు.

## ఢిల్లీ క్లీన్‌స్వీప్

## చరిత్ర సృష్టించిన ఆప్


## దిమ్మ తిరిగిన కమలం

## కాంగ్రెస్‌కు శూన్యహస్తం

భారత దేశానికి గుండెకాయ లాంటి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను చూసి భారతదేశంలో రాజకీయ నాయకులు, పాలకులు, విశ్లేషకులు, సామాన్య ప్రజలు, మేధావులే కాదు ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కూడా ఆశ్చర్యపోయి వుంటారు. ఎందుకంటే ఈ ఫలితాలను అందరితోపాటు ఆయన కూడా ఊహించి వుండరు. ఢిల్లీ పీఠం ఆప్‌దే అని ముందు నుండి సర్వేలు చెబుతున్నా, ఆ పార్టీకి 40 లేదా 45సీట్లు దాకా వస్తాయనుకున్నారేగాని ఇలా 70సీట్లకు గాను 67సీట్లు సొంతం చేసుకుంటుందని అరవింద్ కేజ్రీవాల్ కూడా అనుకుని వుండరు. అంచనాలకు, సర్వేలకు అందని చారిత్రాత్మక విజయమిది. ఈ గెలుపును అభివర్ణించడానికి మాటలు చాలవు.

పదిహేనేళ్లు ఢిల్లీని పాలించి భ్రష్టుపట్టించిన కాంగ్రెస్‌పార్టీకి ఈ ఎన్నికల్లో శూన్యహస్తమే మిగిలింది. దాదాపు అన్ని స్థానాలలోనూ ఆ పార్టీ మూడోస్థానానికి పడిపోవడమే కాక చాలాచోట్ల డిపాజిట్‌లు కోల్పోయింది. అయినా గెలుస్తామనే ఆశ వాళ్లకు లేదు కాబట్టి దిగులు లేదు. వాళ్లకు బాధకంటే బీజేపీకి మూడే సీట్లొచ్చాయన్న ఆనందమే ఎక్కువుగా ఉంది. ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పాత్ర నామమాత్రం. ఇక్కడ అన్ని విధాలా చెడిపోయింది బీజేపీనే! 2013ఎన్నికల్లో 31సీట్లు సాధించి పెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ ఇప్పుడు కేవలం 3సీట్లకే పరిమితం కావడం వాళ్లు జీర్ణించుకోలేని అంశం. (మిగతా 10వ పేజీలో)

## మన నెత్తిపై...



# 'అణు'బాంబు

నెల్లూరు జిల్లా తీరప్రాంతం ఇప్పటికే థర్మల్ విద్యుత్ కేంద్రాల హబ్‌గా మారింది. కృష్ణపట్నం పోర్టు పరిధిలో దాదాపు 25వేల మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులు మంజూరైవున్నాయి. వీటిలో జెన్‌కో, మీనాక్షి, సింహపురి వంటి ప్రాజెక్టులు విద్యుత్ ఉత్పాదన కూడా మొదలుపెట్టాయి. విద్యుత్ కేంద్రాల మూలంగా వెలువడే కాలుష్యం దెబ్బకు తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలు హడలి ఛస్తున్నారు. జిల్లాలో కుప్పలు తెప్పలుగా విద్యుత్ కేంద్రాల ఏర్పాటును నిరసిస్తూ ఆందోళనలు కూడా జరిగాయి. ఈ విద్యుత్ కేంద్రాలన్నీ పూర్తయ్యి ఒక్కసారి ఉత్పత్తి మొదలుపెడితే కాలుష్యం పెరగడంతో పాటు ఉష్ణోగ్రతలు పెరిగి నెల్లూరుజిల్లా నిప్పుల కుంపటిగా మారే అవకాశముంది.

థర్మల్ విద్యుత్ కేంద్రాలకే ఆందోళన చెందుతుంటే ఇప్పుడు అణువిద్యుత్ కేంద్రం భయం జిల్లాను పట్టుకుంది. నెల్లూరు, ప్రకాశం జిల్లాల మధ్య 12వేల కోట్లతో 6వేల మెగావాట్ల అణువిద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ముందుకొచ్చింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన చేసింది. ఇప్పటికే శ్రీకాకుళంజిల్లా కొవ్వాడలో 10వేల మెగావాట్ల అణు విద్యుత్ కేంద్రం మంజూరైంది. దీనిని నిరసిస్తూ గతంలో స్థానికులు ఆందోళనలు నిర్వహించారు కూడా!

(మిగతా 10వ పేజీలో)



# నీరసంగా...

# నెల్లూరు 'దేశం'

## • సరైన లీడర్ లేక కేడర్‌లో నిరాశ

రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ అధికారంలో ఉందనేగాని ఆ ఫీలింగ్ మాత్రం జిల్లాలోని తెలుగుదేశం నాయకులలో, కార్యకర్తల్లో కనిపించడం లేదు. అధికారంలో ఉన్నప్పటికంటే ప్రతిపక్షంలో ఉన్నప్పుడే బాగుందనిపిస్తుంది వారికి. జిల్లాలో పార్టీకి సరైన నాయకత్వం లేకుండా పోయింది. కార్యకర్తలకు సమాధానం చెప్పేవాళ్లు, సరైన మార్గం చూపేవాళ్లు లేకుండా పోయారు. ఎన్నికల ముందు జిల్లా తెలుగుదేశంపార్టీలో ఎటువంటి వాతావరణమైతే ఉండిందో, ఇప్పుడు కూడా అదే కొనసాగుతోంది. ఒకరకంగా చెప్పాలంటే మునుపటికంటే ఇంకా అధ్వాన్నంగా మారిందని చెప్పవచ్చు.

అధికారపార్టీకి సంబంధించి జిల్లా రాజకీయ పరిణామాలన్నీ కూడా ఆ జిల్లాకు సంబంధించిన మంత్రి చుట్టూ తిరుగుతుంటాయి. కాని ఈసారి నెల్లూరుజిల్లాలో పరిస్థితి విచిత్రంగా మారింది. జిల్లాలో ముగ్గురు మాత్రమే తెలుగుదేశం ఎమ్మెల్యేలున్నారు. వారిలో ఎవరికీ మంత్రి పదవి ఇవ్వలేదు. రాజకీయంగా ఎటువంటి అనుభవం లేని పొంగూరు నారాయణకు మంత్రి పదవి ఇచ్చారు. ప్రజలతో కాదు కదా పార్టీ కార్యకర్తలతో, నాయకులతో ఆయనకు సంబంధాలు లేవు. కేడర్‌తో ఎలా మసలుకోవాలో కూడా ఆయనకు తెలియదు. పైపెచ్చు ఆయన జిల్లాకు రావడమే చాలాతక్కువ. వచ్చినా ఎప్పుడొస్తాడో, ఎప్పుడు పోతాడో అర్థం కాదు. అర్ధరాత్రి సమావేశాలు, అర్ధరాత్రి పర్యటనలతోనే (మిగతా 10వ పేజీలో)

# చేపల ఉత్పత్తిలో మనమే ముందు



రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధికి దాదాపు అన్ని రిజర్వాయర్లలో 10కోట్ల మేర చేపపిల్లలను విడుదల చేసి చేపల ఉత్పత్తికి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం క్రింద మీనోత్సవ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.

ఈ నెల 7న నెల్లూరుజిల్లా సోమశిల ప్రాజెక్ట్ వద్ద మీనోత్సవ కార్యక్రమంలో మంత్రులు డా॥ పి.నారాయణ, దేవినేని ఉమామహేశ్వరరావుల సమన్వయంతో 2.12కోట్ల చేపపిల్లలను రిజర్వాయర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వ్యవసాయశాఖమంత్రి మాట్లాడుతూ చేపపిల్లల ఉత్పత్తిలో దేశంలో మన రాష్ట్రం మొదటి స్థానంలో వుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల ప్రయోజనార్థం చేపల పెంపకం అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టి మీనోత్సవ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే ఆక్వా రైతుల అభివృద్ధికి కూడా అధునాతన కార్యక్రమాల అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.

రాష్ట్ర పురపాలకశాఖామంత్రి డాక్టర్ పి.నారాయణ మాట్లాడుతూ ప్రపంచంలో చేపల ఉత్పత్తిలో చైనా దేశం మొదటి స్థానంలో వుందని, మన దేశం రెండవ స్థానంలో వుందన్నారు. అలాగే మన రాష్ట్రం చేపల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. అందులో మన నెల్లూరుజిల్లాలో దాదాపు 2.12కోట్ల చేపపిల్లలను విడుదల చేయడం అభినందనీయమన్నారు.

రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానంగా మత్స్యకారుల కుటుంబాల వారికి మీనోత్సవ కార్యక్రమం ద్వారా చేపట్టే చేపపిల్లల ఉత్పత్తి ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమం నెల్లూరుజిల్లాలోనే గాక రాష్ట్రమంతా జరుగుతుందని, కృష్ణాజిల్లాలో కూడా కృష్ణానదిలో కోట్లాది చేపపిల్లలను విడుదల చేసామన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి, జిల్లా పరిషత్ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఎన్‌డిసిసిబి ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి గౌతంరెడ్డి, రాజధాని కమిటి సభ్యులు బీద మస్తాన్‌రావు, అదనపు జాయింట్ కలెక్టర్ ఆర్‌ఎస్ రాజ్‌కుమార్, ఆత్మకూరు ఆర్‌డిఓ రమణ, ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూటూరు కన్నబాబు, మత్స్యశాఖ జెడి, వ్యవసాయశాఖ జెడి మురళి, డ్వామా పిడి గౌతమి, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

## ఎన్‌బికెఆర్‌లో సౌరశక్తి వెలుగులు



నెల్లూరుజిల్లా కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల సౌరశక్తితో విద్యుద్దీపాలను వెలిగించే కార్యక్రమంకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డా॥ వి.విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విశాలమైన కళాశాల ప్రాంగణమంతా సౌరశక్తి దీపాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సౌరశక్తి దీపాల కోసం మొదటి విడతగా 8లక్షల రూపాయలు ఖర్చుయినట్లు తెలిపారు.

ఈ క్రమంలో కళాశాలలోని పలు అవసరాలకు విద్యుత్‌ను అంచలంచెలుగా సౌరశక్తి వినియోగంలోకి మార్చుకునే కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి రూపొందిస్తున్నట్లు తెలిపారు. రానున్న విద్యాసంవత్సరంలో తమ విద్యా ప్రణాళికలో సాంప్రదాయేతర ఇంధనవనరులపై ప్రత్యేకకోర్సులను పెడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ కొరతను దృష్టిలో పెట్టుకుని పరిసర గ్రామాల్లోనూ సౌరశక్తి వినియోగంపై అవగాహన పెంచి ఆ ఉత్పత్తికి తమ కళాశాల ద్వారా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఎస్.సురేష్‌రెడ్డి, ఎల్.రవీంద్రరెడ్డిలు పాల్గొన్నారు.

## రూరల్ పోలీసు హైరానా!

ఈ నెల 7, 8తేదీలలో రాష్ట్రమంత్రులు పెద్ద సంఖ్యలో నెల్లూరొచ్చారు. వీరంతా నెల్లూరురూరల్ పరిధిలోని కనుపర్తిపాడు విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వివాహ వేడుకకే వచ్చారు. దీంతో అందరి మంత్రుల ప్రోటోకాల్ బాధ్యత నెల్లూరురూరల్ పోలీసుల మీదే పడింది. మంత్రులందరికీ బందోబస్తు కల్పించడానికి, వారిని ఫాలో కావడానికి నెల్లూరురూరల్ పోలీసులు నానాహైరానా పడ్డారు.

## వ్యవసాయానికి అనువైన యంత్రాలు

రాష్ట్ర ప్రభుత్వం సుమిటోమో కంపెనీతో వ్యవసాయానికి అవసరమైన యంత్ర పరికరాలను అందించేలా ఒప్పందం చేసుకున్నట్లు జపాన్ ప్రతినిధి పుకసాక తెలిపారు. ఈ నెల 7వ తేదీ నెల్లూరుజిల్లా కొడవలూరు మండలం యల్లాయపాలెంలో జపాన్‌కు చెందిన సుమిటోమో కంపెనీ కన్సల్టెంట్ అయిన పుకసాక యల్లాయపాలెంలో యంత్రంతో నాట్లు వేసిన వరిసాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటికే సుమిటోమో కంపెనీ పలు రకాల ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. వీటిని ఇక్కడి వ్యవసాయానికి అనువుగా రూపకల్పన చేయాల్సిన అవసరం ఉందా లేక అందుబాటులో ఉన్న యంత్ర పరికరాలను యధావిధిగా ఇక్కడి రైతులకు అందించవచ్చనే విషయాలను పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. జపాన్ ప్రతినిధికి అనువాదకర్తగా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏఎస్ ప్రసాదరావు, ఏఈఓ కిరణ్‌కుమార్, సాగునీటి మౌళిక వసతుల నిపుణుడు జితేంద్ర రైతులు పాల్గొన్నారు.

### జొన్నవాడలో
## ఎస్‌బిఐ ఏటిఎం



జొన్నవాడ కామాక్షి అమ్మవారిని దర్శించే భక్తులు, పరిసర గ్రామ ప్రజల సౌకర్యం కోసం ఎస్‌బిఐ వారు 'అన్నదాన సమాజం కాంప్లెక్స్'లో ఇటీవల గుంటూరు డిప్యూటీమేనేజర్ ఎంఎన్‌పి మిశ్రా చేతుల మీదుగా ఏటిఎంను ప్రారంభించారు. రీజనల్ మేనేజర్ వి.సురేష్, చీఫ్‌మేనేజర్ జి.ఎన్. మూర్తి, అన్నదాన సమాజం అధ్యక్షులు రంగయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ ఏటిఎంతో కలిపి నెల్లూరుజిల్లాలో ఎస్‌బిఐ వారు 160ఏటిఎంలు కలిగివున్నారని రీజనల్ మేనేజర్ తెలిపారు.

## సర్వేపల్లి రోడ్డును పరిశీలించిన తిరుపతి ఎంపి

తిరుపతి ఎంపి వెలగపల్లి ప్రసాదరావు ఆదివారం వెంకటాచలం మండలంలోని సర్వేపల్లి రోడ్డును పరిశీలించారు. ఇక్కడ ఆర్‌ఓబి నిర్మించాలని ప్రజలు కోరివున్న నేపథ్యంలో, ఆయన ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇది వెంకటాచలం నుంచి పలు గ్రామాలకు వెళ్ళే ప్రధానమార్గమని, అయితే ఇక్కడ ప్రతి పది నిమిషాలకూ రైలుగేటు వేస్తుండడంతో ప్రయాణీకులకు ఇబ్బందిగా వుంటోందని ఆయన అంటూ, ఈ విషయమై రైల్వే అధికారులతో మాట్లాడి రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన ఇస్కపాళెం గ్రామంలోని పెళ్ళూరు ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులైన పెళ్ళూరు సుధాకరరెడ్డిని కలిశారు. ట్రస్ట్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఆ తర్వాత ఆయన ఇటీవల మృతిచెందిన వైఎస్సార్సీపి గుడ్లూరివారిపాళెం నాయకుడు ఆమవరపు వేణు కుటుంబసభ్యులను పరామర్శించారు. స్థానికులతో మాట్లాడుతూ ఇస్కపాళెం గ్రామంలో సైడుకాలువల నిర్మాణానికి, వెంకటాచలంలో మంచినీటి పథకం అమలుకు నిధులు అందిస్తామన్నారు. తనకు వచ్చే నిధులతో, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో ఈ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట జడ్పీటిసి సభ్యుడు వెంకటశేషయ్య, నాయకులు అడపాల ఏడుకొండలు, కట్టంరెడ్డి విజయమోహన్‌రెడ్డి, పెళ్ళూరు సుధాకరరెడ్డి, సూరిబాబు, దయాకర్, బాలస్వామి, గోపి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## అధునాతన పరిజ్ఞానంతో నేరాలను అరికట్టాలి

### గుంటూరు రేంజ్ ఐజీ సంజయ్

నేరస్తులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నేరాలకు పాల్పడుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని పోలీసు సిబ్బంది అధునాతన పరిజ్ఞానంతో నేరాలను అరికట్టాల్సిన అవసరం వుందని గుంటూరు రేంజ్ ఐజి ఎన్.సంజయ్ సూచించారు. 7వ తేదీ నెల్లూరు పోలీసు కార్యాలయంలో ఆయన సిసిఎస్, స్పెషల్ బ్రాంచ్ అధికారులతో నేరసమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజి మాట్లాడుతూ ఇటీవల కాలంలో జిల్లాలో నేరాల సంఖ్య పెరుగుతూ ప్రజలు అభద్రతా భావానికి గురవుతున్నారన్నారు. ప్రజలకు తామున్నామన్న భరోసా కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ఏ సీజన్లో, ఏ తరహాలో నేరాలు జరుగుతున్నాయో గుర్తించి తదనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో జరిగే భారీ నేరాలను వెంటనే పొరుగు జిల్లాలకు తెలియజేసి అప్రమత్తం చేయాలన్నారు. నాన్‌బెయిలబుల్ వారెంట్లు ఉన్నవారి వివరాలను అన్ని జిల్లాలకు పంపి అరెస్ట్‌కు సహకారం తీసుకోవాలన్నారు. కేసుల పరిష్కారంలో ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గరాదన్నారు. నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించి బాధితులకు సత్వర న్యాయం చేసి పోలీసుశాఖ పేరును ఇనుమడింపజేయాలన్నారు. అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు.

ఈ సమావేశంలో ఎస్పీ ఎస్.సెంథిల్‌కుమార్, ఏఎస్పీ రెడ్డి గంగాధర్, ఎస్‌బి, సిసిఎస్ డిఎస్పీలు బి.వి.రామారావు, శ్రీధర్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.


## కుష్టువ్యాధి గ్రస్తులకు చేయూత

కుష్టువ్యాధిగ్రస్తులను ప్రభుత్వ ఉద్యోగుల పింఛన్ అసోసియేషన్ సభ్యులు ఆదుకోవడం అభినందనీయమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. 7వ తేదీ సూళ్లూరుపేటలోని కుష్టువ్యాధిగ్రస్తులకు అసోసియేషన్ సభ్యులు చీరలు, పంచెలు, దుప్పట్లు, టవళ్లు, స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పింఛన్ అసోసియేషన్ సభ్యుల భవనంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ అసోసియేషన్‌లో ఉన్న వారంతా అనుభవం ఉన్నవారు కాబట్టి నియోజకవర్గ అభివృద్ధి విషయంలో వారి సలహాలు, సూచనలు తీసుకుంటా నన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ నూలేటి విజయలక్ష్మి, జిల్లా హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి ఎల్.జోసఫ్, రంగనాయకులు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 17న శ్రీ తారకేశ్వరస్వామి కల్యాణం

ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం గ్రామంలోని శ్రీ తారకేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 17వ తేదిన శ్రీ తారకేశ్వరస్వామికి ఘనంగా కల్యాణోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరిగే ఈ కల్యాణోత్సవంలో భాగంగా, స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం జరుగుతాయని, అనంతరం గ్రామోత్సవం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివార్ల కృపాకటాక్షానికి పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## నేత్రదానం



ఆదివారం నెల్లూరులోని గుప్తాపార్క్ సెంటర్, నారాయణరావుపేట వాస్తవ్యులు ఇనుగూరి రాజ్యలక్ష్మి(57) పరమపదించారు. అర్బన్ ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి క్లబ్ నెల్లూరు సంయుక్త ఆధ్వర్యంలో ఆమె కుటుంబసభ్యుల కోరిక మేరకు డా॥ పి.ఎల్.రావు ఆధ్వర్యంలో ఐ బ్యాంక్ టెక్నీషియన్ ఎం.డి.పి.ప్రసాద్ ఆమె నేత్రాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో మోటివేటర్ బయ్యా ప్రసాద్, శేషగిరిరావు, సుమన్‌కుమార్, పి.మల్లిఖార్జున్, శ్రీరంగనాథ్, తులసి సురేంద్ర, పి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రూరల్ అభివృద్ధికి కలిసి పనిచేస్తా

## - - - నెల్లూరు పార్లమెంటు సభ్యులు మేకపాటి - - -



దొంతాలి గ్రామ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని నెల్లూరు పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరురూరల్ మండలం దొంతాలి గ్రామంలో మంచినీటి పథకానికి, సిమెంటురోడ్డుకు ఎంపి రాజమోహన్‌రెడ్డి, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎంపి మేకపాటి మాట్లాడుతూ దొంతాలి గ్రామంతో తనకు ప్రత్యేకానుబంధం వుందని, దొంతాలి గ్రామం నుంచే తన జీవిత గమనం ప్రారంభం అయిందన్నారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని, ప్రజల మధ్యలో వుండి సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం సాగిస్తానన్నారు. ప్రభుత్వ, అధికారుల, ఎంపి, దాతల సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టబోతున్నట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయపార్టీలను భాగస్వామ్యం చేసి అన్ని రాజకీయపార్టీల సలహాలు, సూచనలు తీసుకుంటానన్నారు. రాష్ట్రంలోనే నెల్లూరురూరల్ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కలిగిరమ్మ, జడ్పీటీసీ యాకసిరి రమ, ఎంపిటిసి తాళ్ళూరు లక్ష్మమ్మ, గ్రామ సర్పంచ్ మల్లినేని రత్నమ్మ, తహశీల్దార్, ఎంపిడిఓ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీ ఏఈలు పాల్గొన్నారు.

# 15న 'సింహపురి సింహావలోకనం' పుస్తకావిష్కరణ

నెల్లూరు టౌన్‌హాల్‌లో ఈ నెల 15వ తేదీ ఆదివారం సాయంత్రం 5గంటలకు ప్రముఖ వ్యవసాయ రచయిత రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎం.వి.రమణారెడ్డి రచించిన "సింహపురి సీమ సింహావలోకనం' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరగనుంది. గుండాల గురవయ్య స్వామి ప్రార్థనతో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా డా॥ కాళిదాసు పురుషోత్తం, డా॥ పొనుగోటి కృష్ణారెడ్డి, డా॥ పెళ్లకూరు జయప్రద సోమిరెడ్డి, డా॥ బి.పద్మోదయ, తుంగా శివప్రభాత్‌రెడ్డి, వేమారెడ్డి నిరంజన్‌రెడ్డి, చిరసాని కోటిరెడ్డి, జి.మల్లిఖార్జునశాస్త్రి, చెలంచర్ల భాస్కరరెడ్డి పాల్గొంటారని నిర్వాహకులు చిరసాని కోటిరెడ్డి, అత్తలూరు వెంకటరమణయ్యనాయుడు, సర్వేపల్లి కోటేశ్వరరావు, రైతు డిపో సుధాకర్‌లు తెలిపారు.

# పోర్టులో తమిళ సినిమా సందడి

నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పోర్టులో మంగళవారం తమిళ సినిమా షూటింగ్ నిర్వహించారు. ప్రముఖ తమిళ హీరో సూర్య నటిస్తున్న మాస్ సినిమా దృశ్యాలను పోర్టులోని కంటైనర్ టర్మినల్ వద్ద చిత్రీకరించారు. సినిమాలో హీరో, విలన్‌ల మధ్య కీలకమైన పోరాట దృశ్యాల చిత్రీకరణ జరిగింది. ఈ సినిమా షూటింగ్ పదిరోజుల పాటు జరుగుతుందని సమాచారం. త్వరలో హీరోయిన్ నయనతార పోర్టుకు రానున్నది. హీరో సూర్య, హీరోయిన్ నయనతార మధ్య జరిగే పలు సన్నివేశాలను, పాటను చిత్రీకరించే అవకాశం వుంది. వెంకట్ ప్రభు దర్శకత్వంలో యాక్షన్‌థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాకు నిర్మాత జ్ఞానవేల్‌రాజా, సంగీతం యువన్‌శంకర్ రాజా నిర్వహిస్తున్నారు. షూటింగ్‌ను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహిస్తున్నారు.




# ఆశలు రేపిన వెంకయ్య



కేంద్ర పట్టణాభివృద్ధిశాఖామంత్రి యం.వెంకయ్యనాయుడు ఈ నెల 7, 8తేదీలలో జిల్లాలో జరిపిన పర్యటన జిల్లా ప్రజలలో కొంత ఆశలను రేపింది. జిల్లాకు సీఎం చంద్రబాబు వచ్చినా, ఇతర రాష్ట్ర మంత్రులు వచ్చినా ఒట్టి మాటలు చెప్పి ఒట్టి చేతులు చూపిస్తున్నారు తప్పితే జిల్లా అభివృద్ధికి పైసా విదిల్చడం లేదు. రాష్ట్ర ప్రభుత్వాన్ని నమ్ముకుంటే జిల్లాలో రూపాయి పని కూడా జరిగేటట్లు కనిపించడం లేదు. జిల్లా ప్రజలకు అభివృద్ధి పరంగా మిగిలిన ఆశల్లా వెంకయ్యనాయుడే!

7వ తేదీ జిల్లాలో అడుగుపెట్టిన వెంకయ్య ఆరోజు కావలిలో జరిగిన విశ్వోదయ స్వర్ణోత్సవాలలోనూ, నెల్లూరులో జరిగిన ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రారంభోత్సవంలోనూ, కస్తూర్బా కళా క్షేత్రంలో జరిగిన జనధన్‌యోజన సదస్సులోనూ పాల్గొన్నారు.

8వ తేదీ ఆత్మకూరు, ఉదయగిరిలలో జరిగిన కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఆత్మకూరులో నిర్మించిన 100 పడకల ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. అక్కడే ఏర్పేడు-మాచర్ల జాతీయ రహదారికి, నెల్లూరు-ఆత్మకూరు మధ్య సిమెంటురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆత్మకూరుతో గత స్మృతులను నెమరేసుకున్నారు. ఇక ఉదయగిరిలో జరిగిన కార్యక్రమంలో అయితే వెంకయ్య పూర్తిగా ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లిపోయాడు. 1978, 1983 నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. తనకు రాజకీయ జన్మనిచ్చిన ఉదయగిరికి తాను ఎంత చేసినా తక్కువేనని చెప్పుకొచ్చారు. ఉదయగిరిలో 50పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పోలవరం ప్రాజెక్ట్ ద్వారా గోదావరి నుండి కృష్ణాకు, అక్కడ నుండి పెన్నాకు నీళ్లు తెప్పించి ఉదయగిరికి నీళ్లు అందేలా చేస్తానన్నారు. శ్రీకాళహస్తి-నడికుడి రైల్వే మార్గంపై కేంద్ర రైల్వేమంత్రితో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఇక ఉదయగిరిలో ఇండోర్ స్టేడియం, దేవాలయాలు, మసీదుల జీర్ణోద్ధరణకు మాటిచ్చారు.

ఈ రెండురోజుల పర్యటనలో జిల్లాకు వెంకయ్యనాయుడు భారీ వరాల హామీలు ఇవ్వకపోయినప్పటికి ఆయన పర్యటించిన ఉదయగిరి, ఆత్మకూరు ప్రాంతాల ప్రజలు మాత్రం ఆయన రాకపట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాంతంలో ఒకటి అరా చిన్న పనులు జరిగినా కొంత అభివృద్ధిని కళ్ల చూస్తామనేది వారి ఆకాంక్ష.

# విగ్రహాలు తొలగించండి

## - జాయింట్‌కలెక్టర్ ఇంతియాజ్



ప్రజాప్రయోజనాల స్థలాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను పూర్తిగా తొలగించేందుకు వారంరోజుల గడువు విధిస్తున్నట్లు నెల్లూరుజిల్లా జాయింట్‌కలెక్టర్ ఇంతియాజ్ డివిజన్, మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ భారత అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు అనుమతులు లేని విగ్రహాలను పూర్తిగా నేలమట్టం చేయాలన్నారు. అనుమతులు లేని వాటిని వారంలోపు తొలగించేందుకు నోటీసులు సంబంధిత విగ్రహ ఏర్పాటుదారులకు జారీ చేయాలన్నారు. 2003 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం జివోనెం.18ని జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ సుదర్శన్‌రెడ్డి, జడ్పీ సిఇఓ జితేంద్ర పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# శ్రీసిటీలో జిల్లా కలెక్టర్



నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి మంగళవారం సాయంత్రం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటి మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కలెక్టర్‌కు స్వాగతం పలికి శ్రీసిటీలో నెలకొల్పిన వివిధ దేశ, విదేశ పరిశ్రమల గురించి వివరించారు. శ్రీసిటి ఫౌండేషన్ చేస్తున్న సామాజిక సేవలను వివరిస్తూ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న ఆర్థికాభివృద్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిన్మయా విద్యాలయా, ఫ్రాంటియర్ లైఫ్ లైన్ వైద్య కేంద్రం, కొబెల్కో కన్‌స్ట్రక్షన్ కర్మాగారం, హంటర్ డగ్లస్, ఐఐఐటి వంటి వివిధ ప్రదేశాలలో పర్యటించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. చక్కటి భవిష్యత్తును పొందటానికి అవసరమైన ప్రణాళికలతో వారంతా కృషి చేయాలని, ఉన్నత పదవులను పొందాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. వెనుకబడిన గ్రామీణ ప్రాంతంలో శ్రీసిటి వంటి సంస్థను స్థాపించి, వ్యాపారాభివృద్ధికి అవసరమైన అన్ని వసతులను, చక్కని సదుపాయాలను, పరిశ్రమలకు కావలసిన విధంగా ఏర్పరచినందుకు శ్రీసిటి యాజమాన్యాన్ని కలెక్టర్ అభినందించారు. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ శ్రీసిటిని సందర్శించడం, జరుగుతున్న అభివృద్ధిని ఆసక్తితో గమనించడం, అభినందించడం తమకు సంతోషాన్ని కలిగించిందన్నారు.



# 'ప్రభా'తం

## అ'సామాన్య' విజయం



డిల్లీలో ఆప్ మోత మోగించింది. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలో, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకు గాను 67 స్థానాల్లో ఆప్ అద్భుతవిజయం సాధించి రికార్డు బద్దలుకొట్టింది. ఆమ్ ఆద్మీ సృష్టించిన ఓట్ల సునామీలో బిజెపి, కాంగ్రెస్ కొట్టుకుపోయాయి. బిజెపికి కేవలం 3 స్థానాలు దక్కడం, కాంగ్రెస్‌కు ఒక్క స్థానం కూడా దక్కకపోవడం విశేషం. ప్రజాభిమానం పొందడంలో తమకు ఎదురే లేదని విజయగర్వంతో దూసుకుపోతున్న బిజెపికి ఇదొక చేదు అనుభవమే మరి.

అరవింద్ కేజ్రీవాల్..ఇప్పుడా పేరు ఢిల్లీలో మారుమ్రోగిపోతోంది. ఎక్కడ చూసినా ఆప్ ప్రభంజనమే. రికార్డు బద్దలు కొట్టింది. ఒక్క ఢిల్లీలోనే కాదు, దేశవ్యాప్తంగా 'ఆప్' సంచలన విజయం ప్రకంపనాలు సృష్టిస్తోంది. దేశ ఎన్నికల చరిత్రలోనే గతంలో ఎప్పుడూ లేనివిధంగా, ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకుగాను, 67 స్థానాల్లో 'ఆప్' విజయ దుంధుభి మ్రోగించింది. ఆప్ ప్రభంజనంలో వటవృక్షాల్లాంటి బిజెపి, కాంగ్రెస్‌లే కొట్టుకుపోయాయి. ఢిల్లీ ప్రజల తీర్పు రాజకీయాల్లో కలకలం సృష్టిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీ ప్రజలు ఒక సామాన్యుడికి ఇలా అనూహ్యమైన రీతిలో ఇంతటి అద్భుతమైన.. అసామాన్యమైన విజయం చేకూర్చడం ఎంతైనా చరిత్రాత్మకమే.

ఈ ఎన్నికల్లో ఆప్‌కు 67 స్థానాలు రాగా, కేవలం 3 స్థానాల్లో మాత్రమే బిజెపి విజయం సాధించింది. కాంగ్రెస్ పరిస్థితైతే మరీ ఘోరం. ఒక్క స్థానంలో కూడా గెలవలేక కాంగ్రెస్ పూర్తిగా చతికిలపడిపోయింది. ఎన్నెన్నో విజయాలతో ఇటీవలికాలంలో ముందుకు దూసుకుపోతున్న బిజెపి కూడా ఈ ఎన్నికల్లో ఒక్కసారిగా కుదేలైపోయింది. వెనక్కి తిరిగి చూసేలోగా, ఢిల్లీ పీఠం ఆప్ చేతుల్లోకి వెళ్ళిపోయింది. గత ఎన్నికల్లో 31 స్థానాల్లో విజయం సాధించిన బిజెపి, ఈ ఎన్నికల్లో అనూహ్యంగా 3 కు కుదించుకుపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. బిజెపికి ఇదొక గుణపాఠమనే భావించవచ్చు. గెలుపు ప్రాతిపదికగా పార్టీలోకి కొత్తవారిని చేర్చుకోవడం, ఎంతోకాలం నుంచి పార్టీకి సేవ చేస్తున్నవారిని విస్మరించి, కొత్తగా చేర్చుకున్న అభ్యర్ధిని ముఖ్యమంత్రి అభ్యర్ధిగా ముందుగానే ప్రకటించడం, పార్టీలో అంతర్గతంగా పేరుకుపోతున్న అసంతృప్తి వగైరాలన్నీ బిజెపి ఓటమివైపునకు పయనం సాగించడానికి కారణాలని చెప్పవచ్చు. వీటితోపాటు ముఖ్యంగా, ఢిల్లీ రాష్ట్ర ప్రతిపత్తి విషయాన్ని కూడా బిజెపి విస్మరించిందనే అంశాన్ని ప్రధానంగా కేజ్రీవాల్ ప్రజల దృష్టికి తీసుకు వెళ్ళడం, ఢిల్లీ ప్రజల అవసరాలకు సంబంధించిన మంచినీటి సమస్య, విద్యుత్‌బిల్లుల సమస్య వగైరాల పరిష్కారంపై కేజ్రీవాల్ దృష్టి సారించడం వగైరాలన్నీ ప్రజలకు అటు బిజెపిపై విముఖతను, ఇటు ఆప్‌పై సుముఖతను కలిగించే పరిణామాలుగా మారినట్లు భావించవచ్చు. గతంలో ఢిల్లీ ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ కొద్దిరోజుల పాలనలోనూ ప్రజల సమస్యల పరిష్కారానికి ఆప్ నిరంతర కృషి చేయడం కూడా ప్రజలకు ఆప్ పట్ల అభిమానం పెరగడానికి దోహదం చేసిందనవచ్చు. అందులోనూ అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలో ఆప్ ఇటీవలికాలంలో బాగా బలం పుంజుకుంది. ఢిల్లీలో ప్రముఖ సంఘసేవకుడు అన్నా హజారే నాయకత్వంలో పెద్దఎత్తున ప్రారంభమైన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పాల్గొంటూ మంచిపేరు తెచ్చుకున్నారు. రాజకీయాల్లోకి వచ్చాక ఆమ్ ఆద్మీ పార్టీ స్థాపించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి, అప్పట్లో 70 స్థానాలకు గాను, 23 స్థానాలు సాధించుకున్నారు. తొలి ప్రయత్నంలోనే మంచి మెజార్టీ వచ్చినా, ఢిల్లీ పీఠం అధిష్టించేందుకు తగ్గ బలం లేకపోవడంతో, కాంగ్రెస్ మద్దతుతో 2013లో ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు స్వీకరించారు. అయినా, తాము ఆశించిన జనలోక్‌పాల్ బిల్లు వంటి విశిష్టమైన చట్టాలను తెచ్చేందుకు అసెంబ్లీలో తగ్గ బలం లేకపోవడంతో, ముఖ్యమంత్రి పదవినుంచి అర్ధాంతరంగా వైదొలగారు. ఈ నేపథ్యంలో, తాజాగా వచ్చిన ఎన్నికల్లో ఆప్ మళ్ళీ దిగ్విజయం సాధించడానికి ఆయనెంతగానో కృషి చేశారు. గతం నుంచి పాఠాలు నేర్చుకుని, నిరంతరం ప్రజలను కలిసి, వారితో మమేకమై ప్రజల్లో తనపట్ల వున్న విశ్వాసాన్ని పదిలం చేసుకున్నారు. గతంలో తనవైపు నుంచి జరిగిన తప్పులను కూడా అంగీకరిస్తూ ప్రజల ముందు బహిరంగ క్షమాపణలు చెప్పుకోవడం ద్వారా, ప్రజల నుంచి ఆయన మరింత అభిమానాన్ని, విశ్వాసాన్ని పొందగలిగారు. అదే, ప్రజాభిమానంగా వెల్లువెత్తింది. అందరి సర్వేలనూ తలక్రిందులు చేస్తూ కేజ్రీవాల్ అనూహ్యమైన ఘనవిజయాన్ని సాధించారు. ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో 70 స్థానాలకు గాను 67 స్థానాల్లో 'ఆప్' మోత మోగించారు. ఇదిలావుంటే, ఎన్నికల వ్యూహంలో తమకంటే మించిన వ్యూహకర్తలు లేరని, తామే ఉద్దండులమని భావిస్తున్న బిజెపికి ఇది కలచివేసే పరిణామం. ఢిల్లీలో కేవలం 3 స్థానాలను మాత్రమే గెలుచుకోగలగడం ఆ పార్టీ జీర్ణించుకోలేకపోతోంది. ఢిల్లీ ప్రజల ఈ విలక్షణ తీర్పుతో బిజెపికి ఒక్కసారిగా షాక్ తగిలి నట్లయింది. దిగ్గజాలైన అగ్రనేతలున్న బిజెపికీ, అదేవిధంగా ఎంతో కాలం ఢిల్లీని పాలించిన హేమా హేమీలైన నాయకులున్న కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో ఘోర పరాభవమే ఎదురైందని చెప్పవచ్చు. అందులోనూ ప్రధానంగా, అనేక విజయాలతో ముందుకు దూసుకుపోతున్న బిజెపికి మరింత ఖేదం కలగడం సహజమే. ఢిల్లీ ఎన్నికల సందర్భంగా ప్రధాని మోదీ చేసిన విమర్శలు, కేజ్రీవాల్ అరాచకవాదంటూ చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీకి బాగా నష్టం కలిగించివుంటాయనే అభిప్రాయాలూ వున్నప్పటికీ, పార్టీ ఓటమికి అవే పెద్ద కారణాలని భావించలేం. ప్రజాభిమానం పొందిన బలమైన అభ్యర్థులు రంగంలో వుండాలే గానీ, ఎవరెంతటి ప్రచారాలు చేసుకున్నా ఎలాంటి ప్రయోజనం వుండదనే విషయం అందరికీ తెలిసిందే. ఎన్నికల సందర్భంగా బిజెపి అనుసరించిన రాజకీయ వ్యూహాలు లోపభూయిష్టంగా వుండడంతో పాటు, మితిమీరిన విశ్వాసం బిజెపిని ఓటమి వైపు నడిపించి వుండవచ్చని చెప్పవచ్చు. ప్రధానంగా, మొన్నటిదాకా పార్టీకి సేవలందించిన బలమైన నాయకులను పక్కనబెట్టి, కేవలం గెలుపు కోసమే కొత్తవారిని అప్పటికప్పుడు పార్టీలో చేర్చుకోవడం, కొత్తగా చేర్చుకున్న కిరణ్‌బేడీని ముఖ్యమంత్రి అభ్యర్ధిగా ముందుగానే ప్రకటించడం వంటి విధానాలు ఆ పార్టీ వ్యతిరేక ఫలితాలు పొందడానికి కారణమై వుంటాయని భావించవచ్చు. ఏదేమైనా, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే, ప్రజలను నిర్లక్ష్యం చేసి అధికారం వుంది కదా అని చిత్తం వచ్చిన రీతిలో సాగితే ఏ పార్టీవారికైనా చివరికి ఫలితాలు ఇంత చేదుగానే వుంటాయనేందుకు ఈ ఎన్నికల ఫలితాలు ఒక తాజా ఉదాహరణ అనే చెప్పవచ్చు. ఎంతోమంది ఉద్దండ నేతలున్నా, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఇంతటి అనూహ్యమైన విజయం సాధించగలిగారంటే ప్రజల ఆశీస్సులే ప్రధాన కారణం. అందుకు, కేజ్రీవాల్ చేసిన కృషి, పడిన శ్రమ చిన్నదేమీ కాదు. చేసిన పొరపాట్లు తెలుసుకుని, వాటిని ఆయన సరిదిద్దుకున్నారు. నిరంతరం ప్రజలతో మమేకమై తిరుగుతూ, ప్రజల్లో తనపై వున్న అభిమానాన్ని కాపాడుకున్నారు. జరిగిన పొరపాట్లకు ప్రజలకు క్షమాపణ చెప్పుకున్నారు. దీంతో ఎందరో హేమాహేమీలనుకుంటున్న వారిని సైతం పక్కన పెట్టి ప్రజలు ఒక సామాన్యుడైన కేజ్రీవాల్‌ను విజేతగా నిలబెట్టారు. రాజకీయచరిత్రలోనే ఇది అపూర్వమైనది. అందుకే ఆప్ విజయం చరిత్రాత్మకమైనది. అంతేకాదు, పొరపాట్లు ఎక్కడ జరిగాయో పరిశీలించుకునేందుకు, తమకు తాము ఆత్మ పరిశీలన చేసుకునేందుకు బీజేపీకి ఇదో మంచి సందర్భం కూడా!

## మల్లిఖార్జునపురంను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా!

నెల్లూరుజిల్లా తోటపల్లిగూడూరు మండలంలోని మల్లిఖార్జునపురం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం దత్తత తీసుకున్న మల్లిఖార్జునపురం గ్రామంలో ఆయన పర్యటించారు. ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మల్లిఖార్జునపురం అభివృద్ధికి దూరంగా వున్న గ్రామమన్నారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మాణంతో పాటు వినియోగంపై స్థానికుల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేకచర్యలు తీసుకుంటామన్నారు. విద్యావంతులు, వ్యాపారవేత్తలు, ప్రవాసాంధ్రులు తమ గ్రామాలను, వార్డులను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సావిత్రమ్మ, తహశీల్దార్ రామలింగేశ్వరరావు, బొమ్మి సురేంద్ర, జడ్.శివప్రసాద్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

### రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం

## అధ్యక్షుడిగా నరశింహారావు

నెల్లూరుజిల్లా రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడిగా టి.నరశింహారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కార్యదర్శి శ్రీహరిరావు తెలిపారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో ఎన్నికలు జరిగాయన్నారు. కార్యదర్శిగా శ్రీహరిరావు, ఉపాధ్యక్షుడిగా ఏ.రాధ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాగేశ్వరరావు, ట్రెజరర్లుగా ఎల్.ప్రభాకర్, ఆర్.మోహన్‌రావులు ఎంపికైనట్లు తెలిపారు.

## స్వైన్‌ఫ్లూ మాత్రల పంపిణీ



నెల్లూరు, ఏసి నగర్‌లోని గీతామయి బాలల ఆశ్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ దేవరాల మస్తానమ్మ, దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్ ఆధ్వర్యంలో బాబు గిరిజన కాలనీలోని పేద వారందరికీ ఉచితంగా స్వైన్‌ఫ్లూ నివారణ హోమియో మందులు ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి వై.వి.సుబ్బారావు, జయరామనాయుడు, బుజ్జయ్యనాయుడు, ట్రస్ట్ వ్యవస్థాపకులు తమ్మినేని పాండు, సరళ పాల్గొన్నారు.




## చంద్రబాబు వస్తే అంతేనా?

చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ప్రజలకు దరిద్రం పట్టినట్లవుతుంది. రాష్ట్ర విభజన ద్వారా ప్రజలు నష్టపోయారు. పనులు, వ్యాపారాలు తగ్గాయి. పన్ను పోట్లు పెరిగాయి. ఇప్పుడు రాష్ట్ర ఆదాయం పెంచుకోవడానికి చంద్రబాబు భారీగా విద్యుత్ ఛార్జీలు పెంచాడు. ఇది ప్రజలు చేసుకున్న ఖర్మ. చంద్రన్న కానుకలకు, సింగపూర్, జపాన్ ట్రిప్‌లకు కోట్లు తగలేసి, ఇప్పుడు జనాన్ని బాదడం ఏమన్నా న్యాయంగా ఉందా?

**పినాక నాగేశ్వరసాయి, నెల్లూరు.**

## ఆడంబరాల పెళ్లిళ్లు

ఈమధ్యకాలంలో పెళ్లిళ్లలో ఆడంబరాలు పెరిగాయి. ప్లేటు భోజనం 500 నుండి వెయ్యి రూపాయల దాకా పెడుతున్నారు. రకరకాల స్వీట్లతో పాటు ఎన్నో రకాల వెజ్, నాన్‌వెజ్ వంటకాలుంటున్నాయి. మనిషి జానెడు పొట్టకు ఎంత కావాలి. అదీ కాకుండా జనానికి షుగర్‌లు, బి.పిలు ఎక్కువయ్యాయి. తక్కువ తినడం అలవాటు చేసుకుంటున్నారు. మితాహారం మంచిదని వైద్యులే చెబుతున్నారు. ఆడంబరంగా ఇన్ని వంటకాలు పెట్టే బదులు ఆకలితో ఖాళీ కడుపుతో వున్న వాళ్లకు కొంత పెడితే బాగుంటుంది కదా! ఆహారాన్ని చెత్తకుప్పల్లో పడేసినందు వల్ల ఏం లాభం.

**రాంమనోహర్‌సింగ్, కావలి.**

## భారత్‌ను వేలెత్తి చూపలేరు

భారత్‌లో మత అసహనంపై అమెరికా అధ్యక్షుడు ఒబామా చేసిన వ్యాఖ్యలు విచిత్రంగా ఉన్నాయి. భారతీయులకు మత సహనం ఉంది కాబట్టే క్రిస్టియన్, ఇస్లాంలు కూడా అభివృద్ధి చెందాయి. ఈ దేశానికి మూల సంస్కృతి హిందుత్వం అయినప్పటికీ అన్ని మతాల వారికి సమానంగా జీవించే అవకాశాలున్నాయి. భారతదేశంలో ఆ సహనం ఉండబట్టే క్రైస్తవ మిషనరీలు లక్షల మంది చేత ప్రతి ఏటా మతాలను మార్పిస్తున్నాయి. అమెరికాలో క్రైస్తవులు ఇదే విధంగా ఇంకో మతంలోకి మారితే అసలు ఆ దేశమే మత మార్పిడి నిరోధక బిల్లు పెట్టేది. భారత్‌లో కాబట్టి, ఇక్కడ రాజకీయాలు, ఓట్ల బ్యాంకుల సంస్కృతి వల్ల హిందూ సంస్కృతిపై దాడి జరుగుతున్నా సహనంతో ఉంటున్నారు.


**కె.జి.శర్మ, తిరుపతి.**

## చాలా క్రూయల్!

రుణాలు మాఫీ చేస్తానని వాగ్దానం చేసి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన బాబు ఆ హామీని నెరవేర్చకుండా, రైతులను సామదాన బేధ దండోపాయాలలో చివరిదానిని ఉపయోగించి వాళ్ళ భూములను లాక్కొని రియల్ ఎస్టేట్ వ్యాపారం(క్రూయల్ ఎస్టేట్ వ్యాపారం) చేయాలనుకోవడం చాలా క్రూయల్!

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

# ముందే చేతులెత్తేసారు



ప్రతి ఏడాది కేంద్రప్రభుత్వం పార్లమెంటులో రైల్వే బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్నప్పుడల్లా నెల్లూరుజిల్లాలో కొన్ని రైల్వే అభివృద్ధి పనులు చర్చకు వస్తుందేవి. నడికుడి-శ్రీకాళహస్తి లైన్ ఖచ్చితంగా చర్చకు వచ్చేది. కనీసం ఈ బడ్జెట్‌లోనన్నా ఈ లైన్ మంజూరవుతుందేమోనంటూ ప్రతి ఏటా ఎదురుచూపులు చూసేవాళ్లు. దాదాపు పాతికేళ్ల నుండి అలా ఎదురుచూపులు చూసి జనం విసుగెత్తిపోయారు.

చిత్తూరుజిల్లాలో పాక్షికంగాను, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు పూర్తిగానూ ఈ రైల్వేలైన్ ఉపయోగపడుతుంది. దాదాపు 30కి పైగా మండలాల ప్రజలకు ఉపయోగపడే రైల్వేలైన్ ఇది. ప్రతి ఏటా సర్వేలకే పరిమితమవుతూ వస్తుంది. గత 15ఏళ్లుగా కేంద్రంలో వున్న ఎన్డీఏ, యూపిఏ ప్రభుత్వాలు రైల్వే బడ్జెట్‌లలో రాష్ట్రానికి అన్యాయం చేసాయి. తద్వారా నెల్లూరుజిల్లాకు అన్యాయమే జరిగింది. నడికుడి-వెంకటగిరి లైన్ పూర్తి చేయాలంటే ఇప్పుడు 1400కోట్లు దాకా ఖర్చవుతుందని అంచనా! ఇంత వ్యయంతో ఈ లైన్ వేసినా దానికి తగ్గ రాబడి ఉంటుంది. దీనిపై నివేదిక కూడా వచ్చింది. మెట్ట ప్రాంతాలకు బాగా ఉపయోగపడే మార్గమిది. వెంకయ్యనాయుడు కేంద్రమంత్రిగా ఉన్నాడు. ఈ ఏడాది రైల్వే బడ్జెట్‌లోనైనా ఈ మార్గానికి మోక్షం లభిస్తుందని ఆశ పడుతున్న వారికి అలాంటి ఆశలు పెట్టుకోవద్దని రైల్వే జీఎం శ్రీవాత్సవ ముందుగానే సంకేతాలు పంపారు. కాబట్టి ఇక వెంకటగిరి-నడికుడి రైల్వేలైన్ మంజూరు కోసం బడ్జెట్‌లో ఎదురుచూడాల్సిన పనిలేదు. అలాగే గూడూరు - దుగరాజపట్నం రైల్వేలైన్ ఎప్పుడో మంజూరైంది. సర్వే కూడా జరిగింది. కాని పని పరంగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఈ బడ్జెట్‌లోనూ దీని ప్రస్తావన ఉండకపోవచ్చునని ముందుగానే తెలుస్తుంది. అలాగే బిట్రగుంట లోకోషెడ్ అభివృద్ధి కూడా మూలనపడ్డట్లే. అలాగే నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ ఏ1 స్టేషన్‌గా మార్చడంతో పాటు పలు రైల్వేస్టేషన్‌ల ఆధునీకరణ, సూపర్ ఫాస్ట్ రైళ్ల స్టాపింగ్ వంటి సమస్యలున్నాయి. వీటిలో చాలావరకు నెరవేరే అవకాశాలు తక్కువ.



# ఆ రహదారితో మెట్టకు లాభం

శ్రీకాళహస్తి-నడికుడి రైల్వే లైన్ ఇప్పట్లో వచ్చే అవకాశాలు లేవు. కాని దాదాపు ఈ రైల్వేలైన్ ప్రతిపాదిత మార్గానికి దగ్గరలోనే రోడ్డు మార్గం ఏర్పడుతుండడం పట్ల నెల్లూరుజిల్లా పడమర ప్రాంతాలలోని ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. చిత్తూరుజిల్లా ఏర్పేడు నుండి గుంటూరుజిల్లా మాచర్ల వరకు 250కిలోమీటర్లపైగా పొడవున జాతీయ రహదారి మంజూరైంది. నెల్లూరుజిల్లాలో ఈ రహదారి వెంకటగిరి, పెంచలకోన, కలువాయి, ఆత్మకూరు, దుత్తలూరు, పామూరు, కలిగిరి వంటి ప్రాంతాల మీదుగా వెళ్లి హైదరాబాద్‌కు ప్రధాన రహదారిగా వున్న అద్దంకి జాతీయ రహదారిలో కలుస్తుంది. ఈ నెల 8వ తేదీ ఈ రహదారికి ఆత్మకూరు వద్ద కేంద్రపట్టణాభివృద్ధిశాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు శంకుస్థాపన చేయడం జరిగింది. ఏర్పేడు నుండి పెంచలకోన వరకు రోడ్డు పనులు మొదలయ్యాయి. ఈ రహదారి కోసం దాదాపు 80శాతం భూసేకరణ కూడా పూర్తయినట్లు తెలుస్తుంది.

ఈ రహదారి అందుబాటులోకి వస్తే ప్రధానంగా హైదరాబాద్, ముంబై, చెన్నై వంటి ప్రాంతాలకు ప్రయాణం సులభమవుతుంది. పామూరు, ఉదయగిరి, వింజమూరు, ఆత్మకూరు వంటి ప్రాంతాల వాళ్లు చెన్నై లేదా తిరుపతి లేదా బెంగుళూరు నగరాలకు పోవాలంటే నెల్లూరు దాకా వచ్చి ఇక్కడ నుండి 5వ నంబర్ జాతీయ రహదారిలో ప్రయాణం చేయాల్సి వస్తుంది. దీనివల్ల అనవసర వ్యయంతో పాటు ప్రయాణకాలం కూడా పెరుగుతుంది. ఈ కొత్త జాతీయ రహదారి అందుబాటులోకి వస్తే నెల్లూరుకు వెళ్లకుండానే పెంచలకోన, ఏర్పేడుల మీదుగా అటు తిరుపతికి గాని, లేదంటే నేరుగా చెన్నైకి గాని వెళ్లొచ్చు. బెంగుళూరు వెళ్లే వారికి కూడా ఈ మార్గం సౌకర్యవంతంగా ఉంటుంది.

ఇక వెంకటగిరి, రాపూరు, పొదలకూరు, ఆత్మకూరు వంటి ప్రాంతాల నుండి హైదరాబాద్‌కు వెళ్లాలంటే నెల్లూరుకు వచ్చి 5వ జాతీయ రహదారి మీదుగా ఒంగోలు వెళ్లి అక్కడ నుండి అద్దంకి మార్గంలోకి వెళ్లాల్సివస్తుంది. ఈ కొత్త రోడ్డు ఏర్పడితే నెల్లూరుకు పోయే పని లేకుండానే నేరుగా మాచర్ల రహదారిలో కలవచ్చు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాలైన రాపూరు, వెంకటగిరి, ఆత్మకూరు, వింజమూరు ప్రాంతాల వారికి ఈ మార్గం సరుకు రవాణా పరంగా కూడా ఎంతో ఉపయోగపడుతుంది. ఈ రోడ్డు వల్ల ఇక్కడ మెట్టభూముల ధరలు కూడా పెరిగి రైతులు ఆర్థికంగా ప్రయోజనం పొందే అవకాశాలున్నాయి.

ఇంతవరకు జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి అంతా కూడా తూర్పు ప్రాంతంలోనే కేంద్రీకృతమైంది. జిల్లాలో అభివృద్ధి పరంగా వెనుకబడి వుండేది ఉదయగిరి, రాపూరు, ఆత్మకూరు ప్రాంతాలే! పారిశ్రామికంగా ఇక్కడ అభివృద్ధి జీరో! చెప్పుకోదగ్గ పరిశ్రమ ఒక్కటీ లేదు. దీనికి కారణం రైల్వే, రోడ్డు వసతులు సక్రమంగా లేకపోవడమే. ఈ ప్రాంతాల్లో పరిశ్రమలకు అవసరమైన ప్రభుత్వ, అసైన్డ్, బంజరు భూములు బాగానే వున్నాయి. పరిశ్రమలు పెట్టాలనుకుంటే భూములకు ఎటువంటి కొరత లేదు. ఈ రహదారి పూర్తయితే భూములకు ధరలు రావడంతోపాటు కొన్ని పరిశ్రమలు కూడా ఇటువైపు రావచ్చునేది మెట్ట జనం ఆశ.

# పాలకులు మారారంతే... కార్పొరేషన్ సంస్కృతి కాదు



*నెల్లూరు నగరం ఎంత దరిద్రంగా వుంటుందో నెల్లూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం కూడా అంతే దరిద్రంగా ఉంటుంది. 'యథా రాజా తథా ప్రజ' అని పెద్దలు వూరకే చెప్పలేదు కదా! పాలకులను బట్టే రాజ్యాలు ఉంటాయి. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం అంటే... అదో కామెడీ, హర్రర్, వయెలెంట్, ట్రాజెడీ సీన్లన్నింటిని కలబోసి తీసిన రామ్‌గోపాల్‌వర్మ సినిమా లాగా ఉంటుంది. పాలకసభ్యులు తమ అరుపులు, ఆవేశాలు, హావభావాలతో నవరసాలనూ పండిస్తుంటారు.*

ఈ నెల 7వ తేదీ జరిగిన కౌన్సిల్ సమావేశంలో కూడా సభ్యులందరూ తమ వాగ్దాటిని(నోటితీట), నటనాకౌశల్యాన్ని బాగానే ప్రదర్శించారు. కొత్త పాలకవర్గం ఏర్పడి ఆరునెలలు దాటింది. ఈ కాలంలో జరిగిన రెండో సమావేశం ఇది. సమస్యలపై చర్చల కంటే వాదోపవాదాలకు, వాగ్యుద్ధాలకు సభ్యులు ప్రాధాన్యతనిచ్చారు. నగరపాలక సంస్థ కార్యాలయం బయట సొసైటీ కార్మికులు కొత్త జీఓలతో తమ ఉద్యోగాలను ఊడబెరికే ప్రయత్నం చేస్తున్నారంటూ ధర్నాకు దిగారు. వైయస్సార్ కాంగ్రెస్, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు వారికి మద్దతు తెలిపాయి. పారిశుద్ధ్య కార్మికులు కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించడంతో వారిని నిలువరించడానికి పెద్దఎత్తున పోలీసులను దించారు. పాలకవర్గ సభ్యులను, పాస్‌లున్న మీడియా వారిని, సిబ్బందిని మాత్రమే లోపలకు అనుమతించారు. ఇక సమావేశం మొదలు కాగానే వైకాపా ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్ గత నెల 31వ తేదీన జరగాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని యోగా క్లాసుల కోసం వాయిదా వేసినందుకు మేయర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో మేయర్ అజీజ్‌కు చిర్రెత్తుకొచ్చింది. వెంటనే పోలీసులను లోపలకు పిలిచి రూప్‌కుమార్‌ను బయటకు పంపేయండని ఇంగ్లీష్‌లో ఆదేశించాడు. దాంతో రూప్‌కుమార్‌కు దేంతో కొట్టుకోవాలో తెలియక, తన చెప్పుతో తానే కొట్టుకున్నాడు. నిన్ను మేయర్‌ను చేసినందుకు మాకు మేం ఈ శిక్ష వేసుకుంటున్నామని రూప్‌కుమార్ చెప్పాడు. ఇక్కడ రూప్‌కుమార్‌కు మిగతా వైకాపా కార్పొరేటర్లు అండగా నిలిచారు. దీంతో గొడవ రేగింది. తొలుత పది నిముషాలు సమావేశాన్ని వాయిదా వేశారు. ఇక రాజీవ్‌మార్గ్‌గా గతంలో పేరు పెట్టి వున్న మినీబైపాస్‌కు కొత్తగా సర్దార్‌వల్లభాయ్ పేరు పెట్టడాన్ని కాంగ్రెస్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి తీవ్రంగా ఆక్షేపించారు. ఇక్కడ తెలుగుదేశం సభ్యులు వాదనకు దిగారు. నెల్లూరులో ఆసుపత్రులు, కూరగాయల మార్కెట్, స్టేడియాలకు మీ కుటుంబం పేర్లే పెట్టుకున్నారంటూ దేశం కార్పొరేటర్ డాక్టర్ జడ్.శివప్రసాద్ ఎదురుదాడి చేశారు. ఈ పేరు విషయం లోనూ కొంతసేపు రభస. అలాగే కౌన్సిల్‌హాల్‌లో పాత ఛైర్‌పర్సన్‌ల ఫోటోలు ఏర్పాటు చేయాలనే అంశంపై రచ్చ. పారిశుద్ధ్య కార్మికుల అంశంపై వాగ్యుద్ధం... ఇలా రచ్చరచ్చగా సమావేశం సాగింది. అయితే అజెండాలోని అంశాలను మాత్రం ఎటువంటి చర్చ లేకుండానే చదువుకుంటూ పోయి ఏకపక్షంగా ఆమోదించేయడం విశేషం.




# నెల్లూరు కబుర్లు

## కేబినెట్ అంతా నెల్లూరులోనే...

రాష్ట్ర మంత్రివర్గమంతా కూడా ఈ నెల 7, 8తేదీలలో నెల్లూరులోనే ఉన్నట్లని పించింది. తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోదరుడి కుమారుడి వివాహ వేడుకలకు హాజరు కావడానికి కొందరు, ఇక ఈ రెండు తేదీలలోనే కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు అధికార కార్యక్రమాలలో పాల్గొనేందుకు ఇంకొందరు మంత్రులు ఈ రెండు రోజులు నెల్లూరు రావడం జరిగింది. అలాగే సీఎం చంద్రబాబు తనయుడు నారా లోకేష్ కూడా 7వ తేదీ సోమిరెడ్డి ఇంట జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. మంత్రుల్లో చూస్తే ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్పతో పాటు యనమల రామకృష్ణుడు, అయ్యన్న పాత్రుడు, పత్తిపాటి పుల్లారావు, గంటా శ్రీనివాసరావు, నారాయణ, రావెళ్ల కిషోర్‌బాబు, పీతల సుజాత, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావులు వచ్చారు. 8వ తేదీన మంత్రి పరిటాల సునీత విపిఆర్‌లో జరిగిన రిసెప్షన్‌లో పాల్గొంది. ఇక రాష్ట్ర వైద్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, రవాణాశాఖ మంత్రి సిద్దా రాఘవరావులు వెంకయ్య కార్యక్రమాలలో పాల్గొన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక ఒకేసారి ఇంతమంది మంత్రులు నెల్లూరు రావడం ఇదే తొలిసారి!



## వెంకటేశ్వరలో క్యాంపస్ సెలక్షన్లు

నెల్లూరులోని శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఇటీవల ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ 'క్యాడిసిన్ ఇండియా లిమిటెడ్', హైదరాబాద్ ఆధ్వర్యంలో బి.టెక్, ఆఖరి సంవత్సరం చదువుతున్న ఇసిఇ, సిఎస్‌ఇ, ఇఇఇ, ఎంఇసిహెచ్ మరియు సివిల్ విద్యార్థినీ విద్యార్థులకు "ఆన్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్" జరిగింది.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా॥ బి.దత్తాత్రేయ శర్మ, కంపెనీ ప్రెసిడెంట్ డా॥ ఎం.వి.ఎస్.రమణ, క్యాడిసిన్ మేనేజర్ పల్లవన్‌లు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మెన్ డా॥ పెనుబల్లి బాబునాయుడు ప్రసంగిస్తూ ఇప్పటివరకు జరిగిన ప్రాంగణ ఎంపికలలో మల్టీనేషనల్ కంపెనీలైన కింబర్లైట్, ఏటిడిఎస్, క్యాడ్‌ప్లాయ్, ఎటిఎన్ మెవిట్‌లలో 24మంది విద్యార్థులు ఎంపికయ్యారని, మున్ముందు ప్రముఖ కంపెనీలలో రిక్రూట్‌మెంట్స్ ఏర్పాటు చేయటంతో పాటు విద్యార్థులందరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని యాజమాన్యం తరపున హామీ ఇచ్చారు.

## క్విజ్ పోటీలకు విశేష స్పందన



నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని విశ్వ సాయి జూనియర్ కళా శాలలో నిర్వహించిన క్విజ్ ఒలింపియాడ్‌కు జిల్లా నలుమూలల నుండి 500 మందికి పైగా 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మెన్ డా॥ యన్.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి సబ్జెక్టు నేర్చుకున్న తరువాత వారు పొందిన విషయ పరిజ్ఞానంలో ఎంత సమర్థత సాధించారో తెలుసుకోవడం ఈ ఒలింపియాడ్ క్విజ్ ముఖ్య ఉద్దేశ్య మన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థి యొక్క గ్రాహకశక్తి విశ్లేషణ సామర్థ్యం, జ్ఞాపకశక్తి, పునశ్చరణ సామర్థ్యాలను వివరిస్తాయన్నారు. ప్రతిభగల విద్యార్థి ప్రోత్సాహం పొందుట వలన అది గుర్తించి ఇతర విద్యార్థులు కూడా ఉత్తేజితులై భవిష్యత్తులో వారు కూడా ఆ స్థాయికి ఎదగటానికి శాయశక్తుల ప్రయత్నిస్తారన్నారు. ఒలింపియాడ్ క్విజ్‌లో ప్రథమ ప్రోత్సాహకానికి ఎంపికైన విద్యార్థి బృందాన్ని అభినందిస్తూ మాదరన్ స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి 25,000ను అందజేశారు. జాతీయ పోటీ పరీక్షల్లో పాల్గొనే ప్రతి విద్యార్థి ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను పెంపొందించుకోవాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ఛైర్మెన్ కృష్ణమోహన్‌రావు, ఫిజిక్స్ సీనియర్ అధ్యాపకులు రంగనాథ్‌రావు, కెమిస్ట్రీ సీనియర్ అధ్యాపకులు బాలాజీ బాబు, మాథ్స్ సీనియర్ అధ్యాపకులు పెంచలరావు, క్విజ్ నిర్వాహకులు మహ్మద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**సవరణ:** తేది. 06.02.2015 సంచికలోని 6వ పేజీలో నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుమార్తె పెళ్లి పత్రికల పంపిణీకి సంబంధించిన వార్తలో వివాహపు తేదీని ఈ నెల 24వ తేదీ అని పొరపాటున ప్రచురించడమైనది. దానిని ఈ నెల 27వ తేదీగా సవరించుకోవలసినదిగా మనవి.

## డా. జగదీష్‌కు ఐరాస ఆహ్వానం



ప్రముఖ అంతర్జాతీయ ప్రత్యామ్నాయ ఇంధన వనరుల నిపుణుడు, నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలెప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ డైరెక్టర్ డా. ఎ.జగదీష్‌కు ఐక్యరాజ్య సమితి నుంచి ఆహ్వానం అందింది. ఈ ఏడాది మే 17 నుంచి 21వ తేది వరకు న్యూయార్క్‌లో జరుగనున్న రెండవ ఐక్యరాజ్యసమితి సస్టైనబుల్ ఎనర్జీ ఫర్ ఆల్ సదస్సులో పాల్గొన వలసిందిగా ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ స్పెషల్ రెప్రజెంటేటివ్ నుంచి ఆ మేరకు ఆయన ఆహ్వానం అందుకున్నారు. డా.జగదీష్ వాషింగ్టన్‌లోని యుఎన్ ఫౌండేషన్ ఫర్ సస్టైనబుల్ ఎనర్జీ ఫర్ ఆల్ సప్లై చెయిన్, ఎంటర్‌ప్రినర్‌షిప్, ఎనర్జీ మరియు అగ్రికల్చర్ వర్కింగ్ గ్రూప్‌లో సభ్యులు కూడా. ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, వాతావరణం, అప్రాప్రియేట్ టెక్నాలజీలపై డాక్టర్ జగదీష్ ఎంతో కాలంగా విశేష కృషి చేస్తున్నారు. అంతర్జాతీయ, జాతీయ వైజ్ఞానిక పత్రికల్లో ఆయన రచించిన ఎన్నో వ్యాసాలు ప్రచురితమయ్యాయి కూడా. అంతేకాదు, 40 దేశాల్లో జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లో డాక్టర్ జగదీష్ పాల్గొన్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన 15 అంతర్జాతీయ, జాతీయ అవార్డులన సైతం అందుకున్నారు. మరెంతో విశిష్టమైన మార్గరెట్ నోబుల్ ఫౌండేషన్, సిఐటెల్, అమెరికా అవార్డులను కూడా అందుకుని, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల రంగంలోనూ, శాస్త్ర పరిజ్ఞానం లోనూ ఉన్నతమైన స్థాయిలో రాణిస్తున్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో నెల్లూరు సీమ కీర్తిబావు టాను రెపరెపలాడిస్తూ, త్వరలో ఐక్యరాజ్య సమితి ఆహ్వానం మేరకు న్యూయార్క్‌కు వెళ్లనున్న ప్రఖ్యాత శాస్త్రవేత్త డా.జగదీష్‌కు 'లాయర్' శుభాభినందనలు.

## వాత్సల్యకు పాండు రంగారెడ్డి లక్ష విరాళం



ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు, స్వాతంత్రో ద్యమంలో 11సార్లు జైలు కెళ్లిన తుంగా పాండురంగారెడ్డి జన హిత–వాత్సల్యను సంద ర్శించి, అనాథ బాల బాలికలకు, వృద్ధులకు, నిరుపేదలకు చక్కని విద్యను అందిస్తూ, నిస్వార్థంగా సేవ చేస్తున్న జనహిత–వాత్సల్యకు మంగళవారం రూ. 1,00,000/- విరాళాన్ని జనహిత–వాత్సల్య గౌరవాధ్యక్షులు సామంతు గోపాల్‌రెడ్డికి అందజేశారు.

ఈ సందర్భంగా తుంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ నిరాధార బాలబాలికలకు, వృద్ధులకు, సమాజంలో అట్టడుగు పేద బడుగువర్గాల ప్రజలకు, పిల్లలకు సహాయం చేయడం తన ధర్మమని, వాత్సల్య నిర్వహణ చాలా చక్కగా ఉందని, ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది సేవాభావంతో సేవ చేయడం, పిల్లలకు చక్కని సంస్కారవంతమైన విద్యనందించడం చాలా గొప్పగా ఉందని కొనియాడారు. జనహిత–వాత్సల్యకు మిత్రులద్వారా మరింత సహాయాన్ని అందిస్తూ తనవంతు సహాయ సహకారాలను అందిస్తానన్నారు.

## బిందుమీనన్‌కు హరీష్‌చంద్ర బెజోరియా అవార్డు

ఇండియన్ ఎపిలెప్సీ అసోసియేషన్ రెండేళ్లకొకసారి అందించే "హరీష్‌చంద్ర బెజోరియా" అవార్డును ఈ ఏడాది వైద్యరంగంలో సేవలందిస్తున్న న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్ అందుకున్నారు. ఆదివారం చెన్నైలో జరిగిన అసోసియేషన్ వార్షిక సమావేశంలో ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ప్రస్తుతం సింహపురి హాస్పిటల్‌లో సీనియర్ కన్సల్టెంట్ న్యూరోఫిజిషియన్‌గా పనిచేస్తున్నారు. మూర్ఛవ్యాధి గ్రస్తులకు చేసిన సామాజికసేవకు గాను ఈ అవార్డును బిందుమీనన్‌కు ప్రదానం చేశారని హాస్పిటల్ సిఏఓ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

## అన్నదానం



నెల్లూరులోని స్వరాజ్యలక్ష్మిహాల్, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత స్వర్గీయ బయ్యా వెంకటరమణయ్య అకాల మరణానికి చింతిస్తూ ఆయనను స్మరించుకుంటూ ఆదివారం చిన్నబజారు స్వరాజ్యలక్ష్మి హాల్, విఆర్‌సి సెంటర్‌లోని శుభమస్తు షాపింగ్ మాల్ సిబ్బంది ఆధ్వర్యంలో చిన్నబజార్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన కుమారులు బయ్యా శ్రీనివాసులు, వెంకటరవికుమార్‌లు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## ముగిసిన 'పోలో' పోటీలు

రాజరికం, గొప్పవారు ఆడే ఆట అయిన పోలో ఆటను ఈరోజు మరో రకంగా సైకిల్ పోలో అంటూ ప్రతి ఒక్కరికి అందుబాటులోకి తీసుకొచ్చిన అందరూ అభినందనీయులని మాజీశాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన నెల్లూరు కొండాయపాలెం వద్ద ఉన్న ఇన్‌ఫాంట్ జీసస్ స్కూల్‌లో రాష్ట్ర స్థాయి సైకిల్ పోలో గేమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆట ఒకప్పుడు రాజులు గుర్రాలు, ఏనుగుల మీద ఆడేవారని, తురవాత ప్రొఫెషనల్‌గా గొప్పింటివారు గుర్రాల మీదనే ఆడుతూ వచ్చారని తెలిపారు. కాగా, బుధవారంతో ఈ పోటీలు ముగిసాయి. పోటీల్లో విజేతలకు కాంగ్రెస్ నాయకులు ఏసి సుబ్బారెడ్డి చేతుల మీదుగా ట్రోఫీని అందజేశారు.



## టిబి ఆసుపత్రి తరలింపు

నెల్లూరు పొదలకూరురోడ్డులో వున్న టిబి(క్షయ) ఆసుపత్రిని బుధవారం దర్గామిట్టలోని ప్రభుత్వ వైద్యకళాశాల జనరల్ ఆసుపత్రిలోకి తరలించారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించారు. క్షయ ఆసుపత్రిలో వున్న పదిమంది రోగులను ప్రభుత్వాసుపత్రి లోకి తరలించారు. పాత క్షయ ఆసుపత్రి 1952లో నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లా వాసులకు సంబంధించి 264పడకలతో ఏర్పాటై సేవలు అందించింది.

## నెల్లూరులో హరికృష్ణ

నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలం కాకుటూరులో బుధవారం జరిగిన ఓ వివాహ వేడుకలో సినీనటుడు, మాజీ రాజ్యసభసభ్యుడు నందమూరి హరికృష్ణ పాల్గొన్నారు. అలాగే జొన్న వాడలో కామాక్షమ్మ ఆలయాన్ని, నర్సింహా కొండలో లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని దర్శించుకుని పూజలు చేశారు.

## మేయర్ సతీమణి పర్సు చోరీ

నెల్లూరు కాపువీధిలోని ఓ బట్టల దుకాణంలో నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ సతీమణి షేక్ షర్మిల హ్యాండ్‌బ్యాగులోని పర్సు చోరీకి గుర య్యింది. షాపింగ్ చేస్తుండగా తనతో పాటు తెచ్చుకున్న హ్యాండ్‌బ్యాగులో ఉం డాల్సిన పర్సు కనిపించలేదు. అందులో రూ. 80వేలు నగదు, లాకర్ తాళాలు, క్రెడిట్ కార్డులు ఉన్నాయి. ఈమేరకు మూడవ నగర ఎస్సై నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రాజగోపురం మహాకుంభాభిషేకం



ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలోని శ్రీ మీనాక్షి సమేత శ్రీ రామేశ్వర వేణుగోపాలస్వామి వార్ల దేవస్థానంలో ఈనెల 13వతేదీ నుండి 17వ తేదీ వరకు రాజగోపుర మహాకుంభాభిషేకం, వీరభద్ర అయ్యప్పస్వామి వార్ల విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాలు అత్యంత వేడుకగా జరుగనున్నాయి. 13, 14, 15తేదీల్లో నదీ తీర్థగ్రహణం, గణపతి పూజ, అంకురారోహణ, కలశ స్థాపన, ప్రధాన దేవతా హోమంలు, శిఖరగ్రామ ఉత్సవం, మహాకుంభాభిషేకం, అష్టబంధ సంస్కారం, నాడీ సంధానము, మహా పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు జరుగుతాయి. 16వ తేదీ మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, వేణుగోపాల స్వామి వార్లకు సహస్ర నామార్చాన కార్యక్రమాలు జరుగుతాయి. 17వ తేదీ మహాశివరాత్రి రోజు ఉదయం కల్యాణం, రాత్రి లింగోద్భవకాల అభిషేకం, గ్రామోత్సవం జరుగుతాయి. వైదికరత్న బ్రహ్మశ్రీ మాచవోలు రాజశేఖర శాస్త్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని పల్లిపాడు గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## కళ్యాణ వైభవం...!









## సోమిరెడ్డి ఇంట పెళ్లి సందడి

మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోదరుడు హర్షవర్ధన్‌రెడ్డి-ప్రశాంతిల కుమారుడు **అర్జున్ - లక్ష్మీ ఇషిత**ల వివాహం ఈ నెల 7వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖామాత్యులు యం.వెంకయ్యనాయుడు అల్లీపురంలోని సోమిరెడ్డి ఇంటికి వచ్చి నూతన దంపతులను దీవించగా, దాదాపు పదిమందికి పైగా రాష్ట్రమంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అన్ని రాజకీయ పక్షాల నాయకులు, ఉన్నతాధికారులు, నెల్లూరు నగర ప్రముఖులు, సర్వేపల్లి నియోజకవర్గ కార్యకర్తలు, తెలుగుదేశంపార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.



## పింఛన్‌దారుల అగచాట్లు తీర్చండి

నెల్లూరు నగరం రంగనాయకులపేటలోని పోస్టాఫీసు వద్ద పింఛన్లు పంపిణీ చేయడాన్ని మంగళవారం నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమిషనర్, మేయర్ అర్హులైన వారికి పెన్షన్లు ఇస్తున్నామని చెబుతున్నారని, కానీ ఏ పోస్టాఫీసు దగ్గరకు వెళ్లినా అయిదారురోజుల నుంచి అవ్వాతాతల వయస్సున్న వారు కాళ్లరిగేలా తిరుగుతుంటే ఇక్కడ కాదు అక్కడ, అక్కడ కాదు ఇక్కడ అంటూ ముసలివారిని తిప్పుకుంటూ వారిచ్చే వెయ్యిరూపాయలు ఆటో ఛార్జీలకే సరిపోతున్నాయన్నారు. చిన్నచిన్న పోస్టాఫీసుల్లో 500మందికి పింఛన్లు ఇస్తూ కనీసం షామియానా, మంచినీరు వంటి సదుపాయాలు కల్పించకుండా మండుటెండలో అనేకమంది పింఛన్‌దారులు అవస్థలు పడుతున్నా అధికారులు ఈ ప్రాంతాలకు వచ్చి పరిస్థితి ఎలా వుందా అని తెలుసుకున్నారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకుని మానవతా దృక్పథంతో పింఛన్‌దారులకు ఇబ్బందులు లేకుండా పింఛన్‌లను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## నందగోపాల్‌కు ఆత్మీయ సన్మానం



చెన్నైలో 'సాక్షి' దినపత్రిక ప్రతినిధిగా పనిచేస్తున్న నెల్లూరీయుడు, ప్రముఖ పాత్రికేయుడు సి.నందగోపాల్‌కు ఈ నెల 10న నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా ఆత్మీయ సన్మానం జరిగింది. హిందూ దినపత్రికలో ప్రిన్సిపల్ కరస్పాండెంట్‌గా పనిచేసి రిటైరైన సి.నారాయణరావు తన తండ్రి సి.ఎ.కృష్ణన్ పేరుమీద ప్రతి ఏడాది ఫిబ్రవరి 10న సంస్మరణ సభ నిర్వహించి, నెల్లూరు పత్రికారంగంలో విశిష్టసేవలందించినవారిని ఘనంగా సత్కరిస్తున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పాత్రికేయుడు నందగోపాల్ పత్రికారంగానికి చేస్తున్న సేవలను అభినందిస్తూ, రూ.5 వేల నగదును అందజేసి, ఘనంగా సన్మానించారు. ఈ సభకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.ఎం.డి ఇంతియాజ్ అహ్మద్ విచ్చేసి, నందగోపాల్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ, ప్రభుత్వానికి-ప్రజలకు మధ్య పాత్రికేయులు వారధిగా వుంటూ సమాజంలో ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తున్నారన్నారు. నిత్యం ఎంతో పనివత్తిడితో వుంటూనే పాత్రికేయులు నిరంతరం క్షణం తీరికలేకుండా తమ విద్యుక్త ధర్మాన్ని నెరవేరుస్తుంటారని వారి సేవలను కొనియాడారు. సీనియర్ పాత్రికేయులైన సి.నారాయణరావు తన తండ్రి స్మృత్యంకంగా ప్రతిఏటా ఒక ఉత్తమ పాత్రికేయుడిని సన్మానించడం ఎంతో మంచి సంప్రదాయమని జేసీ అభినందించారు. అనంతరం నందగోపాల్ మాట్లాడుతూ, నెల్లూరులోని అనేకమంది పాత్రికేయులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకెంతో ఆనందం కలిగిస్తోందన్నారు. ప్రస్తుతం తాను చెన్నైలో పనిచేస్తున్నానని, తొలుత నెల్లూరులో పత్రికారంగంలో ఎంతోకాలం పనిచేశానని, ఇంతమంది పాత్రికేయుల సాహచర్యం లభించడం తనకెంతో ఆనందం కలిగిస్తోందన్నారు. గతంలో సుప్రసిద్ధ పాత్రికేయులు స్వర్గీయ తుంగా రాజగోపాల్‌రెడ్డి సారథ్యంలో 'లాయర్' వార పత్రికలో పనిచేశానని, ఆ అనుభవం తన పాత్రికేయ జీవితానికి పునాది వేసిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. తనను ఆదరించి సన్మానించిన జాయింట్ కలెక్టర్‌కు, సభా నిర్వాహకుడు సి.నారాయణరావుకు, ముఖ్య అతిథులకు, పాత్రికేయులందరికీ ఆయన తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఏపియుడబ్ల్యుజె ఉపాధ్యక్షుడు జయప్రకాష్, ప్రెస్‌క్లబ్ ఇన్‌ఛార్జి వివిఎస్ చలపతి, 'లాయర్' వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి పాల్గొని నందగోపాల్‌ను అభినందించి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఫయాజ్, సాయిబాబా(ఆత్మకూరు), 'లాయర్' సబ్‌ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులు, వివిధ పత్రికలకు చెందిన పాత్రికేయులు, మీడియా ప్రతినిధులతో పాటు నందగోపాల్ మిత్రులు గోపాల్, శేషాద్రి, గిరి, జిల్లా సురేష్, రఘు, కె.వి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.





## నీళ్లు వదిలిన ఎమ్మెల్యే

ఈ నెల 9వ తేదీన కావలి కాలువ ఎస్కేప్ ఛానల్ ద్వారా కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చేతులమీదుగా నీళ్లు విడుదల చేశారు. ఈ కాలువ నీటి ద్వారా కావలి నియోజకవర్గంలోని గౌరవరం, ముంగమూరు, సాంబశివాపురం, కోళ్లదిన్నె, కమ్మువారిపాళెం, బ్రాహ్మణక్రాక గ్రామాలలో 2వేల ఎకరాలలో పంటలు ఎండిపోకుండా కాపాడడం జరిగిందని ప్రతాప్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నీళ్లు వదలడానికి సహకరించిన మంత్రి పి.నారాయణకు, కలెక్టర్ యం.జానకికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# శ్రీకాళహస్తి న్యూస్

## ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహోత్సవాలు ఫిబ్రవరి 12వ తేది నుంచి ప్రారంభమై 24వ తేదికి ముగుస్తాయి. 12వ తేది భక్త కన్నప్ప ధ్వజారోహణము, 13వ తేది శ్రీ స్వామివారి ధ్వజారోహణము( దేవరాత్రి), 14వ తేది రెండవ తిరునాళ్ళు (భూతరాత్రి), 15వ తేది రావణాసుర - మయూర వాహనసేవ (గాంధర్వరాత్రి), 16వ తేది నాలుగవ తిరునాళ్లు (నాగరాత్రి), 17వ తేది మహాశివరాత్రి, 18వ తేది ఉదయం రథోత్సవము, రాత్రి తెప్పోత్సవము (బ్రహ్మరాత్రి), 19న కళ్యాణోత్సవము, (స్కంధరాత్రి), 20వ తేది సభాపతి కళ్యాణం, 21వతేది కైలాసగిరి ప్రదక్షిణము, 22వతేది తీర్థవారి (ధ్వజారోహణము), 23వ తేది పల్లకీసేవ, 24వ తేది ఏకాంతసేవతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కార్యనిర్వణాధికారి బి.రామిరెడ్డి తెలిపారు.

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం దక్షిణ కైలాసంగా వెలుగొందుతోందని పల్లవ, చోళ, విజయనగర రాజులకాలపు శిల్పకళా నైపుణ్యం ఈ క్షేత్రంలో ప్రస్ఫుటమవుతోంది. 1516లో శ్రీకృష్ణదేవరాయులు తన దక్షిణ భారతదేశ విజయయాత్రకు చిహ్నంగా పెద్ద గాలిగోపురంతోపాటు ఆలయంలోని నూరుకాళ్ళ మండపాన్ని కూడా నిర్మించారు. దేవాలయంలో వైదిక ఆగమ విధానంలో పంచ పూజలు జరుగుతున్నాయి. ఉదయం నుంచి మూడు మధ్యాహ్నం వరకు మూడుసార్లు అభిషేకాలు, సాయంత్రం ప్రదోష కాలాన ఒక అభిషేకంతోపాటు మొత్తం నాలుగు కాలాల అభిషేకాలు కొనసాగుతున్నాయి. ప్రతి యేటా నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆలయంలో అత్యంత ప్రధానమైనవి. ఈశ్వరుని ఆన మేరకు బ్రహ్మ దేవుడు కైలాసన గల శిఖరాలలో ముఖ్యమైన శివానందైక నిలయమును శిఖరాన్ని శ్రీకాళహస్తి క్షేత్రంలో స్థాపించి శివుని అనుగ్రహం పొందారని పురాణాలు చెబుతున్నాయి. తద్వారా శ్రీకాళహస్తికి దక్షిణకైలాసమనే పేరు వచ్చింది. ఆలయాన్ని ఆనుకొని సువర్ణముఖినది పట్టణానికి ఉత్తర వాహిణిగా ప్రవహిస్తోంది. ఆలయంలోని తిరుమంజున గోపురానికి ఎదురుగా వున్న స్నాన ఘట్టాలను మణికల్లికా స్నానఘట్టాలు ఉన్నందున ఈ క్షేత్రాన్ని దక్షిణకాశి అని పిలుస్తారు. శ్రీకాళహస్తి ఆలయ నిర్మాణంలో ప్రత్యేకత ఉంది. ఈ ఆలయంలో వినాయకుడు, శ్రీకాళహస్తీశ్వర స్వామి, జ్ఞానప్రసూనాదేవి, దక్షిణామూర్తి వీరందరూ ఒక్కొక్కరు ఒక్కో దిశలో వెలసి ఉన్నారు. జీవులు తరించడానికి మూలమగు ధర్మం, అర్థం, కామం, మోక్షం చతుర్విద పురుషార్థాలకు సూచనగా ఈ ఆలయాన్ని నిర్మించారన్నది పూర్వీకుల నమ్మకం. తూర్పున జ్ఞానాన్ని ప్రసాదిస్తూ జ్ఞానప్రసూనాంబికాదేవి, పడమటి దిక్కున శ్రీకాళహస్తీశ్వరుడు, దక్షిణాన దక్షిణామూర్తి, ఉత్తర దిక్కున వినాయకుడు ఉండేలా ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. ఆలయంలోని శిల్పకళ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన ఆలయం ఉంది. శ్రీకాళహస్తీశ్వరుడు స్వయంభువు. శ్రీ అనగా సాలె పురుగు, కాళ అనగా పాము, హస్తి అనగా ఏనుగు. ఈ మూడు జీవులు శివభక్తి వల్ల ముక్తి పొంది పరమేశ్వరునిలో ఐక్యమయ్యాయి. అప్పటి వరకు సత్యవ్రత భాస్కరక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఈ ప్రదేశానికి శ్రీకాళహస్తి అని పేరు వచ్చింది. పార్వతీదేవికి పరమేశ్వరుడు పంచాక్షరీ మంత్రాన్ని బోధించి నిశల చిత్తంతో జపించమని ఆదేశించారు. దాక్షాయణికి మందబుద్ధి ఆవరించి నియమాలను విస్మరించింది. పరమశివుడు కోపోద్రిక్తుడై ఆమెను భూలోకంలో స్త్రీగా పుట్టమని శపించాడు. అప్పుడు పార్వతీదేవి శాప విమోచనానికి శివుని ప్రార్థించగా భూలోకాన కైలాసగిరి ప్రాంతంలో తన గురించి తపస్సు చేసి తరించాలని హితవు చెప్పారు. ఆమె తపస్సును మెచ్చి పరమేశ్వరుడు ప్రత్యక్షమై తన అర్థాంగాన నిలుపుకొని అర్థనారీశ్వరుడయ్యారు. అప్పటి నుంచి ఆమె శ్రీ జ్ఞానప్రసూనాంబిక అనే పేరుతో శ్రీకాళహస్తీశ్వరస్వామి సాన్నిధ్యాన వెలసింది. ప్రణమ పంచాక్షరి జపసిద్ధిని పొంది భక్తజనావళికి శ్రీ జ్ఞానప్రసూనాంబికా అయింది. పంచభూత లింగాలలో శ్రీకాళహస్తి వాయులింగంగా పేరుగాంచింది. కృతయుగంలో శ్రీకాళహస్తీశ్వరుని మహా యోగులు మాత్రమే తాకేవారు. త్రేతాయుగంలో స్వర్ణరూపంలోనూ, ద్వాపర యుగంలో రజత రూపంలోనూ, కలియుగంలో శ్వేత శిలారూపంలో వెలసియున్నారు. వాయులింగానికి నిదర్శనంగా శ్రీ స్వామివారి గర్భాలయంలో కుడివైపున ఉన్న దీపాలు రెండూ ఎల్లప్పుడూ జలిస్తుండడం గమనించదగిన విషయం. స్వామి ఉచ్చాస, నిశ్వాసాల వల్ల దీపాలు చలిస్తుంటాయని చెబుతుంటారు.

### ఆలయ గోపురాలు

శ్రీకాళహస్తి ఆలయానికి నాలుగు దిక్కుల్లోను గోపురాలు ఉండడం విశేషం. ఇవి కాక సుమారు 120అడుగుల ఎత్తు ఉన్న రాజగోపురం ఉంది( ప్రస్తుతం ఆ గోపురం కూలిపోయింది, నిర్మాణం జరుగుతుంది). తూర్పు వైపున ఆలయ ప్రవేశ ద్వారంగా బాలాజ్ఞానాంబ గోపురం, ఉత్తరం వైపున శివయ్య గోపురం, పశ్చిమాన తిరుమంజన గోపురం ఉంది. చంద్రపుష్కరిణి, సూర్య పుష్కరిణిలు కూడా ఉన్నాయి. దక్షిణం వైపు గోపురం ద్వారా కన్నప్ప కొండకు, శిల్పకళలకు పుట్టినిల్లయిన బ్రహ్మగుడికి వెళ్ళవచ్చు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆనుకోని దక్షిణం వైపున కన్నప్ప కొండ ఉంది. ప్రతియేటా జరిగే మహాశివరాత్రికి బ్రహోత్సవాలను ఈ కొండపై నుంచే ప్రారంభిస్తారు. భక్త కన్నప్ప ఆలయంలో ధ్వజారోహణతో ఉత్సవాలను ప్రారంభించండం విశేషం. భక్తకన్నప్పకు తొలిపూజ చేయడం ఆనవాయితీగా వస్తోంది.

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామికి గరుడసేవ



గూడూరు పట్టణంలోని న్యూబాలాజీ నగర్ ప్రాంతంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ 6వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. అందులో భాగంగా 7వ తేదీ ఉదయం స్నపన తిరుమంజన, విశేష హోమాలు, ప్రత్యేకపూజలు జరిగాయి. రాత్రి శ్రీవారికి గరుడసేవ నిర్వహించారు. వెంకటేశ్వరుడు ఊంజల్ సేవలో కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. ఈ కార్యక్రమాలకు ఎమ్.మోహన్ కుమార్‌రాజు, ప్రభావతి బెల్లంకొండ నాగేశ్వరరావు, సుజీవనమ్మ, మునగ వెంకటసుబ్బారావు, నాగజ్యోతి, మారంరెడ్డి దయాకర్‌రెడ్డి, శ్రావణి దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు.



# గూడూరు డివిజన్ వార్తలు

## స్వైన్‌ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలి

### వీడియో కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు




సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

అధికార యంత్రాంగం స్వైన్‌ఫ్లూని నివారించేందుకు అప్రమత్తంగా వ్యవహరించాలని సిఎం చంద్రబాబునాయుడు సూచించారు. ఇటీవల గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులు, నాయకులు హాజరయ్యారు. ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై పలు ఆదేశాలు ఇచ్చారు. బడ్జెట్, యోగా, నీరు-చెట్టు కార్యక్రమం, స్వచ్ఛాంధ్ర, స్మార్ట్‌సిటీ, విలేజ్, వార్డులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్, తహశీల్దార్ వెంకటనారాయణమ్మ, గూడూరు మున్సిపల్ కమిషనర్ ప్రమీల, పలుశాఖల అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



న్యాయవాదులను సన్మానిస్తున్న యరగుడిపాటి రామారావు, వై.చలపతిరావు

## న్యాయవాదులకు సన్మానం

గూడూరులో హనుమంతరావునగర్‌కు చెందిన సీనియర్ న్యాయవాది యరగుడిపాటి రామారావు న్యాయవాది వృత్తిలో 66సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా ఆయన నివాసంలో ఆదివారం న్యాయవాదుల సంఘం ఆద్వర్యంలో సన్మానించారు. ఇటీవలే బార్ అసోసియేషన్ సభ్యులుగా వుండి ఆత్మకూరు, ఉదయగిరి, గూడూరులకు రెండవ తరగతి మేజిస్ట్రేట్‌గా బాధ్యతలు స్వీకరించిన వి. పెంచలయ్య, ఎం.కోటేశ్వరరావు, పి.శంకరయ్యలను సంఘం అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు, పలువురు సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి, కడపజిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు విసి గున్నయ్య, సీనియర్ న్యాయవాధులు పాల్గొన్నారు.

## లిటిల్ ఏంజెల్స్‌లో క్రిసాలిస్ డే



గూడూరు మండలం, చిల్లకూరు శారదానగర్‌లోని లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 10వ తేదీ చెన్నై ఇజడ్ విద్య వారి సహకారంతో 1, 2, 3తరగతి విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యావిధానంలోని నూతన పోకడలకు అనుగుణంగా క్రిసాలిస్‌డేను పాఠశాల ఆవరణలో జరిపారు. దీనిలో భాగంగా పిల్లలు, ఉపాధ్యాయుల సహకారంతో అన్ని సబ్జెక్టులలోని విషయాలకు సంబంధించిన సృజనాత్మక ప్రదర్శన ఏర్పాటు చేయించామని, దీనిలో పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారని పాఠశాల కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యంరెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మునిగిరీష్, ఇజడ్ విద్య రెప్రజెంటేటివ్ జయేష్, ప్రిన్సిపల్ మరియు అకడమిక్ కో-ఆర్డినేటర్ సుధేష్ణా, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ ఆవరణలో ఫుడ్‌ప్లాజాను ప్రారంభిస్తున్న శ్రీవాత్సవ

## రైల్వేస్టేషన్‌లో శ్రీవాత్సవ తనిఖీలు

గూడూరు రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు రైల్వే జీఎం కె.శ్రీవాత్సవ తెలిపారు. స్థానిక రైల్వేస్టేషనల్లో ఇటీవల ఆయన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తత్కాల్ రిజర్వేషన్ ప్రక్రియలో బయట వ్యక్తులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారించి అక్రమాలను నిరోధించేందుకు చర్యలు చేపడతామన్నారు. గూడూరు జంక్షన్ కావడంతో 4, 5 ఫ్లాట్ ఫారాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపి ఉన్నామన్నారు. సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలు వేళల్లో మార్పులు చేయాలని పలువురు కోరగా పరిశీలిస్తామన్నారు. స్టేషన్‌లో ఉన్న విశ్రాంతి గదులు, కొత్తగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ప్రారంభించారు. అలాగే రైల్వేస్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఫుడ్‌ప్లాజాను జిఎం శ్రీవాత్సవ ప్రారంభించారు. అనంతరం ఆయన వచ్చిన ప్రత్యేక రైలులో నెల్లూరుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఎం ప్రదీప్‌కుమార్, హెచ్‌వోడిలు, సిసిఎం లక్ష్మీనారాయణ, గూడూరు రైల్వేమేనేజర్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముగిసిన సోషల్ ఫేర్



గూడూరు రెండవ పట్టణంలోని వివేకానంద పాఠశాలలో రెండురోజులపాటు నిర్వహించిన సోషల్ ఫేర్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్ళను వివిధ పాఠశాలల విద్యార్థులు తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సోషల్‌లోని చరిత్ర, పౌరశాస్త్రం వంటి అంశాలు మరిచిపోతున్న ఈరోజుల్లో ఇటువంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు తెలియజేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ కేశంశెట్టి చంద్రమోహన్, వంశీకృష్ణ, కౌన్సిలర్ ఇస్రాయిల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రాశి - మీ వాసి



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 13.02.2015 నుండి
తేది. 19.02.2015 వరకు

ఈ వారం మీనంలో కుజ శుక్ర కేతువులు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని, మకరంలో బుధుడు, కుంభంలో రవి, వృశ్చికధనుర్మకర కుంభరాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 17 మంగళవారము మహాశివరాత్రి
ముహూర్తములు లేవు

**మాఘ మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 13 | శుక్ర | నవమి | సా॥ గం.4.07వ॥ |
| తేది. 14 | శని | దశమి | సా॥గం.3.22వ॥ |
| తేది. 15 | ఆది | ఏకాదశి | ప॥గం.2.13వ॥ |
| తేది. 16 | సోమ | ద్వాదశి | ప॥గం.12.43వ॥ |
| తేది. 17 | మంగళ | త్రయోదశి | ఉ॥గం.10.53వ॥ |
| తేది. 18 | బుధ | చతుర్దశి | ఉ॥గం.8.47వ॥ |
| | పిదప | అమావాస్య | పూర్తిగ |

**ఫాల్గుణ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 19 | గురు | పాడ్యమి | రా॥గం.4.10వ॥ |

## మేషం



అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము

ఖర్చులు అదనంగా ఉంటాయి. అయినా ఆర్థికంగా ఇబ్బందులుండవు. కుటుంబంలో, బంధువర్గంలో అనారోగ్య బాధలుంటాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు దొరకడం, ఆదాయం పెరగడం ఉంటుంది. నిరుద్యోగులకు అవకాశాలు అందుతాయి. దూర ప్రయాణాలు నిర్ణయం కావడం, ఆస్తి వ్యవహారాలు, కోర్టు వ్యవహారాలలో ఆటంకాలు తొలగిపోవడం ఉంటుంది.

## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

ఆర్థికపరమైన ఆలోచనలు, ప్రయత్నాలు ఫలించ గలవు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం, ప్రాముఖ్యత బాగుంటుంది. శుభవార్తలు వినడం జరుగుతుంది. షేర్లు పెట్టుబడి రంగాలలో లాభా లుంటాయి. కోర్టు కేసులు, ఆర్థిక లావాదేవీలు అనుకూలం కాగలవు. అవసరాలు, చెల్లింపులు వాయిదా వేసికొనగలరు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అదనపు ఖర్చుల విషయంలో జాగ్రత్త పడతారు. కొత్త వ్యాపారాలు, కాంట్రాక్టుల వంటి వాటికి ప్రయత్నాలు జరుగుతాయి. నూతన పెట్టుబడులు, డిపాజిట్‌లకు అనుకూలత ఉంటుంది. బంధుముఖ్యుల అనారోగ్య విషయాలు తెలుస్తాయి. కోర్టు కేసులు వాయిదా పడ వచ్చును. బిడ్డల విద్యా వివాహ విషయాలలో శ్రద్ధ చూపుతారు. వివాదాస్పద విషయాల జోలికి వెళ్లవద్దు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యాపారాలలో ఆర్థిక ఇబ్బందులను దాటి ఆదాయం పెంచుతారు. ఆస్తి వ్యవహారాలు, కోర్టు వ్యవహారాలు కొంత అనుకూలంగా మారతాయి. ప్రభుత్వ అను మతులు, బ్యాంకు ఋణాలలో కొద్ది ఆలస్యం జరుగు తుంది. ఖర్చులు అదనంగా ఉండగలవు. అనుకున్న పనులు టెన్షన్‌లో పెట్టి జరుగుతాయి. అనవసర వివాదాలలోకి మిమ్మల్ని లాగాలని ప్రయత్నిస్తారు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఉద్యోగరీత్యా గాని, ఆర్థిక రీత్యా గాని వత్తిడులు ఎక్కువగా ఉంటాయి. చిన్న విషయాలందు బంధు వర్గంతో మనస్పర్ధలు రావచ్చును. వృత్తిపరంగా బాగుంటుంది కాని వ్యాపారపరంగా అవకాశాలు తప్పి పోవచ్చును. ఆదాయం కంటే ఖర్చులెక్కువగా ఉంటాయి. ఆత్మీయులను కలుసుకొంటారు. పనులు చురుకుగా సాగుతాయి. ఆరోగ్యం బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

పనులందు టెన్షన్ ఎక్కువగా ఉన్నా సానుకూలంగా జరుగుతాయి. పెట్టుబడులు, షేర్లు నిరుత్సాహ పరుస్తాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు రావడం, ఆదాయం పెరగడం ఉంటుంది. ఉద్యోగ బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహిస్తారు. సోదర వర్గానికి మేలు జరుగుతుంది. పెండింగ్ కేసులందు అనుకూలత ఉంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి జీవనము కలవారికి అవకాశాలు కలిసి వస్తాయి. వ్యాపార వర్గాలకు రాబడి పెరుగుతుంది. ముఖ్య అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చు. గృహ వస్తు వాహన రిపేర్లు ఖర్చులు అదనంగా ఉంటాయి. పెండింగ్‌లో ఇబ్బంది పెట్టుచున్న పనులు అనుకూలం కాగలవు. ఆస్తి, కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. అనుకోని ప్రయాణాలుంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

మీ ఆర్థిక ప్రణాళికలు, ఆలోచనలు కార్య రూపా నికి వస్తాయి. వృత్తివ్యాపారాలలో అభివృద్ధి అవకాశాలు బాగుంటాయి. ఆదాయం పెరుగుతుంది. నిర్మాణాలు, కాంట్రాక్టు పనులు నిదానంగా సాగుతాయి. ఉద్యో గులకు అధికారులతో సఖ్యత బాగుంటుంది. ముఖ్య విషయాలను అందరికీ చెప్పవద్దు. చెపితే సమస్యలు ఎదురుకాగలవు. షేర్లు సంతృప్తికరము.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

అనుకోని ఖర్చులు పైనబడతాయి. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. మొగమాటాలకు పోయి హామీలివ్వకండి. రావలసిన బాకీలు చేతికందక పోవచ్చును. ఆస్తి వివాదాలు పరిష్కారానికి రాగలవు. స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరుగవచ్చును. ఉద్యోగార్థు లకు అనుకూలకాలం. విద్యాప్రగతి బాగుంటుంది. అనుకున్న పనులు సక్రమంగా జరుగగలవు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి ఉపాధి పథకాలు ఉత్సాహకరంగా సాగు తాయి. వ్యాపారంలో పెట్టుబడులకు గాని, వ్యాపారవృద్ధికి గాని అవకాశాలు దొరుకుతాయి. ఆదాయం పెరుగు తుంది. వేడుకలు శుభకార్యాలలో పాల్గొంటారు. షేర్లు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, స్థిరాస్తుల లావాదేవీలు చేపట్టడం జరుగుతుంది. ఉద్యోగ నిర్వహణలో గుర్తింపు గౌరవాలు బాగుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కష్టానికి తగ్గ ఆదాయం ఉండకపోవచ్చు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఉద్యోగులు అధికారుల తీరును, పబ్లిక్‌ను గమనించుకొని పోవడం మంచిది. మంచి ఆలోచనలుండినా అమలులో ఇబ్బందు లుంటాయి. విలువైన, వస్తువులు, పత్రాలు, నగదును జాగ్రత్తగా కాపాడుకొనండి. నిరుద్యోగులకు అవకాశాలు లభించవచ్చును. అనుకోని ఖర్చులు చెల్లింపులుంటాయి. విద్యార్థులకు మరింత శ్రద్ధ అవసరం.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వస్తు వాహన గృహ రిపేర్లుంటాయి. ప్రభుత్వ అనుమతులు, ప్రభుత్వం ద్వారా రావలసిన నగదు ఆలస్యం కావచ్చును. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఆదాయం, ఖర్చులు సరిపోతుంటాయి. ముఖ్య పనులను మీరే పర్యవేక్షణ చేసుకుంటే మంచిది. షేర్లు, పెట్టుబడులు నిరుత్సాహం కలిగిస్తాయి. సొంత పనులకు అడ్డంకులు ఎదురుకాగలవు.

# అర్హులందరికీ దీపం

కిరోసిన్ ప్రక్కదారికి మళ్లకుండా లబ్ధిదారులందరికి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి శ్రీమతి పరిటాల సునీత అన్నారు.

మంత్రి ఆదివారం నెల్లూరు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో వున్న గోల్డెన్ జూబ్లీ సమావేశమందిరంలో పౌరసరఫ రాల శాఖాధికారులతో ఆ శాఖ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దీపం పథకం క్రింద మంజూరైన గ్యాస్ కనెక్షన్లు మార్చి 31వ తేదీ లోపు గ్రౌండ్ చేయాలన్నారు. జిల్లాలో 96శాతం ఆధార్‌కార్డులు ఇవ్వడం జరి గిందని, మిగతావారికి కూడా ఆధార్ కార్డులు ఇవ్వాలని ఆదేశించారు. దీపం పథకం అమలు గురించి ఎప్పటికప్పుడు మండల అభివృద్ధి అధికారులు సమీ క్షించాలన్నారు. పార్టీలకు అతీతంగా అర్హు లైన వారందరికీ దీపం కనెక్షన్లు ఇచ్చే విధంగా చూడాలన్నారు. జిల్లాలో గోదా ముల కొరత ఉందని, ఎవరైనా దాతలు రెండు ఎకరాల స్థలం ఇస్తే గోదామును నిర్మిస్తామన్నారు.

రైతు బజార్లను సక్రమంగా నిర్వహించి అటు ప్రజలకు ఇటు రైతులకు న్యాయం చేయాలన్నారు. అపార్ట్‌మెంట్ దగ్గర కూర గాయలు అమ్మటానికి మొబైల్ వ్యాన్లు రైతు సంఘాలతో మాట్లాడి ప్రయోగాత్మకంగా అమలు చేయాలన్నారు.

జాయింట్ కలెక్టర్ ఏ.ఎం.డి ఇంతి యాజ్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం



సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి పరిటాల సునీత

కొనుగోలు ఫిబ్రవరి మూడవ వారం నుండి ప్రారంభమైందన్నారు. ధాన్యం కొను గోలుపై ఒక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసినట్లు, ధాన్యం కొనుగోలు సెంటర్లో అమ్మిన ధాన్యానికి రైతులకు ఆన్‌లైన్లో 48గంటలలోపు వారి ఖాతాలో డబ్బు జమ చేయడం జరుగుతుందన్నారు.

ఈ సమావేశంలో డిఎస్‌ఓ శ్రీమతి సంధ్యారాణి, నెల్లూరు, గూడూరు, ఆత్మకూరు, కావలి, నాయుడుపేట ఆర్‌డిఓలు పౌరసరఫరాశాఖాధికారులు పాల్గొన్నారు.

# నెల్లూరును చీకట్లోకి నెట్టారు

## టిడిపి కార్పొరేటర్ల ధ్వజం

ఇరవై ఏళ్లుగా హిట్లర్‌లా పాలిస్తూ నెల్లూరు కార్పొరేషన్‌ను భ్రష్టు పట్టించింది... నిధులను దిగమింగి అప్పుల్లోకి నెట్టింది... నగర అభివృద్ధిని అడ్డుకుంది... మీ(ఆనం) కుటుంబం కాదా... కొత్తగా నగర మేయర్ అబ్దుల్ అజీజ్‌ను హిట్లర్‌గా అభివర్ణిస్తూ దూషించడం, విమర్శలు చేయడం సిగ్గుచేటని, నీ అవివేకానికి నిదర్శనమని 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డిపై 20వ డివిజన్ కార్పొరేటర్ దాసరి రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నెల్లూరు తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ నెల్లూరు కార్పొరేషన్ అయిన తర్వాత మొట్టమొదటి మేయర్‌గా ఎన్నికైన పులిమి శైలజను ముప్పతిప్పలు పెట్టింది మీరు కాదా అని ప్రశ్నించారు. మీ కుటుంబ దోపిడీతనానికి దౌర్జన్యాలకు గత ఎన్నికల్లో ప్రజలే బుద్ధిచెప్పారన్నారు. మేయర్ అజీజ్ స్వార్థం కోసమో, రాజకీయాలు చేసేందుకో రాజకీయాల్లోకి రాలేదని, నిస్వార్థంతో ప్రజాసేవ చేస్తున్నారన్నారు. కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలు, నగరాభివృద్ధిపై అనేక అంశాలను అజెండాలో చేర్చి వాటిపై చర్చ ప్రారంభించిన మేయర్‌ను ఉద్దేశపూర్వకంగా, వ్యక్తిగత కక్షతో అడ్డుకుని కౌన్సిల్ జరగకుండా చేసారన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు నూనె మల్లిఖార్జునయాదవ్, బాల కోటేశ్వరరావు, అబ్దుల్ జలీల్, రాజానాయుడు, సత్యనాగేశ్వరరావు, మన్నెం పెంచలనాయుడు, మల్లిబోయిన వెంకటేశ్వర్లుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన 'గీతాంజలి' విద్యార్థులు




గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఇటీవల కళాశాల యన్.యస్.యస్. విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా యన్.యస్.యస్. విద్యార్థి కార్యకర్తలను ఉద్దేశించి కళాశాల అడ్మిషన్స్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఫణి కుమార్ ప్రసంగిస్తూ మొక్కల పెంపకం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని, గ్లోబల్ వార్మింగ్, పారిశ్రామిక కాలుష్యం మానవజాతికి పెనుముప్పుగా పరిణమించాయని, దీనికి పరిష్కారం మొక్కలు పెంచడమేనని చెప్పారు.

ఈ కార్యక్రమంలో కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి వెంకయ్య, యన్.యస్.యస్ అధికారి రంజిత్ కృష్ణ, కళాశాల పిడి అశోక్‌కుమార్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# పోలీసులకు ప్రత్యేక పిఆర్సీ కమిటి వేయాలి

దేశ రక్షణ విభాగంలో పనిచేస్తున్న సైనికుల జీతభత్యా లపై కేంద్రం ఏ విధంగా ప్రత్యేక పిఆర్సీ కమిటి వేసిందో ఆదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం పోలీసులకు ప్రత్యేక పిఆర్సీ కమిటీని వేయాలని జిల్లా పోలీసు అధికారుల సంఘం కోరింది. ఇటీవల పదవ పిఆర్సీ సిఫార్సుల మేరకు ప్రకటించిన అలవెన్స్‌ల విషయంలో పోలీసులకు అన్యాయం జరిగిందన్నారు. 2004లో సీనియర్లకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని వెయిటేజ్ ఇంక్రిమెంట్లు, ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి పొల్యూషన్ అలవెన్స్ క్రింద 20శాతం మంజూరు చేయాలని పోలీసు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వై.శ్రీహరిబాబు, గౌరవసలహాదారు జి.మాధవరెడ్డి, కోశాధికారి కె.బాబు, సంయుక్తకార్యదర్శి పి.వీరాంజనేయులు, రాష్ట్ర కో-ఆర్డినేటర్ బి.శివప్రకాష్‌లు డిమాండ్ చేశారు.

# ప్రకృతే ఒక పెద్ద ప్రయోగశాల




ప్రకృతి నుంచే శాస్త్రవేత్తలు ఎన్నో కొత్త విషయాలను కనుగొన్నారని, అసలు ప్రకృతే ఒక పెద్ద ప్రయోగశాల అనీ ప్రఖ్యాత ప్రత్యామ్నాయ ఇంధన వనరుల శాస్త్రవేత్త డా. ఎ.జగదీష్ అన్నారు.

నెల్లూరులోని విఆర్ కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఎస్‌వి రామమూర్తి, డాక్టర్ సి.రమేష్ కుమార్ సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్షులు ఎగిరే విధానాన్ని బట్టి విమానాలను, బాతులను గమనించి పడవలను, కంటి పనితనాన్ని బట్టి కెమెరాను, సాలెపురుగును గమనించి మగ్గాన్ని, మానవ మెదడు పనిచేసే విధానాన్నిబట్టి కంప్యూటర్‌ను రూపొందించారని అన్నారు. విద్యార్థులు శాస్త్ర పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, సైన్స్ కోర్సులపై ప్రతి ఏటా భారత ప్రభుత్వం 10వేల కోట్ల రూపాయలను ఖర్చుపెడుతోందని ఆయన అన్నారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై ఎక్కువగా ఆధారపడాలని, ముఖ్యంగా సోలార్, బయో ఎనర్జీలను మన అవసరాలకు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. విఆర్‌సి పాలకవర్గ కార్యదర్శి, కరస్పాండెంట్ ఆనం వివేకానంద రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఉపన్యాస కార్యక్రమాల వల్ల విద్యార్థులు ఎంతో విజ్ఞానాన్ని అందుకోగలరని అన్నారు. విఆర్‌సిలో చదివిన ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సీనియర్ న్యాయవాది ఎన్.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదువుకుంటే వారు తప్పకుండా విజయం సాధిస్తారని అన్నారు. ఇద్దరు దివంగత అధ్యాపకుల సంస్మరణార్థం ఇలాంటి సభలు నిర్వహించడం ఫిజిక్స్ విభాగం చేస్తున్న మంచి కార్యక్రమమని అభినందించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌సి సిఇఓ పి.సుధాకర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచి లక్ష్యాలతో చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. ఎస్‌వి రామమూర్తి ఫౌండేషన్ స్థాపన, ఆశయాలను ఈ సందర్భంగా విఆర్‌సి ఫిజిక్స్ హెచ్‌ఓడి డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం వివరించారు. ఈ కార్యక్రమంలో, నలుగురు బిఎస్సీ తృతీయ సంవత్సరం చదువుకుంటున్న విద్యార్థులు షేక్ కాలేషా, ఎం.వెంకటేశ్వర్లు, జి. సిరియా, కె.కాశీరాములుకు డాక్టర్ జగదీష్, ఎన్ శ్రీనివాసులురెడ్డి స్కాలర్ షిప్‌లను, ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రముఖ శాస్త్రవేత్త డా. ఎ.జగదీష్‌ను అతిథులందరూ కలసి ఘనంగా సత్క రించారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.బాబు, ఫిజిక్స్ రీడర్ డాక్టర్ జి.కృష్ణకిశోర్, అధ్యాపకులు బి.వేమారెడ్డి, వివి కృష్ణశర్మ, బి.హరిప్రసాద్, రిటైర్డ్ అధ్యాపకులు డాక్టర్ పి.మల్లికార్జునరెడ్డి, డాక్టర్ ఎ.వి రంగారెడ్డి, డి.రామచంద్రా రెడ్డి, కె.రవీంద్ర, డాక్టర్ బాబర్, డాక్టర్ అశోక్‌రావు, గరుడేశ్వరరెడ్డి, డాక్టర్ టివి రవీంద్రరెడ్డి, డాక్టర్ పద్మప్రియ, అనిత, శ్రీవాణి, సుబుద్ధి, హనుమంతకుమార్, డాక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# రైతులు సహకరించాలి

రైతులు ఆలోచించి అందరికీ సాగునీరు అందేలా తమవంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి రైతులను కోరారు.

సోమవారం నెల్లూరు రూరల్ మండలం పరిధిలోని వెల్లంటి గ్రామ పరిధిలో వున్న కనుపూరు కాలువ వెంబడి కలెక్టర్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ నిబంధలనుసరించి నీరు వాడుకోవాలని రైతులను కోరారు. ఈ సందర్భంగా పి.జనార్ధన్ అనే రైతు మాట్లాడుతూ ఈ ప్రాంత పరిధిలో వున్న వరిచేలు పండు దశకు వచ్చాయని నీరు ఎక్కువ అవసరం లేదన్నారు. దీనికి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రైతు ఇతర రైతుల గురించి ఆలోచించాలని, ప్రతి ఆయకట్టు చివరి ప్రాంతానికి కూడా నీరు పారేలా రైతులు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పోలీసు అధికారులతో మాట్లాడుతూ కాలువ నుండి అక్రమంగా నీరు ఇంజన్ల ద్వారా తోడినట్లయితే సంబంధిత నీటి ఇంజన్లను సీజ్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా కాలువ వెంబడి పికెటింగ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు కాలువ నుండి అక్రమంగా నీరు తీసుకెళ్లకుండా కాలువ గట్లు వెంబడి వివిధ శాఖల అధికారులు తిరిగి పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

కలెక్టర్ వెంబడి రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ మరియు వ్యవసాయశాఖాధికారులు వున్నారు.

# 'అణు'బాంబు

(మొదటిపేజీ తరువాయి)

తమిళనాడులోని కూడంకుళంలో కూడా అణువిద్యుత్ కేంద్రాన్ని నిరసిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమాలు జరగడం తెలిసిందే! అణువిద్యుత్ కేంద్రాలలో చిన్న ప్రమాదాలు జరిగినా పెనుముప్పుకు దారితీస్తుంది. ఇటీవల జపాన్‌లో సునామీ వచ్చినప్పుడు అక్కడి అణువిద్యుత్ కేంద్రంలో జరిగిన ప్రమాదాన్ని చూసాము. మన జిల్లాలో అణువిద్యుత్ కేంద్రం అంటే పక్కలో బల్లెం పెట్టుకోవడమే!

# కావలిలో ఐటి దాడులు

నెల్లూరుజిల్లా కావలి పట్టణంలో బుధవారం ఆదాయపు పన్ను (ఐటి) అధికారులు దాడులు నిర్వహించారు. ఐటి అదనపు కమిషనర్ బిసిసి నాయక్ ఆదేశాల మేరకు అధికారి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నలుగురు సభ్యుల బృందం కావలి వచ్చారు. కావలి పట్టణంలోని రియల్టర్లపైనే ప్రత్యేకంగా దృష్టి సారించి దాడులు నిర్వహించారు. ఒకే సమయంలో నాలుగైదు ఇళ్లపై అధికారులు సోదాలు చేపట్టారు. పట్టణంలోని బృందావనం కాలనీ సమీపంలోని ఒక నివాసంలో, తుమ్మలపెంట రోడ్డులో ఒక వ్యాపారస్తుడి ఇల్లు, కొత్తబజారులో మరొక వ్యాపారి నివాసం, పాత ఊరులో ఒక రియల్టర్ ఇళ్లలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న జాబితాకు సంబంధించి 30మంది పేర్లు ఈ అధికారుల దగ్గర వున్నట్లు సమాచారం. ఇటీవల లక్షల్లో రిజిస్ట్రేషన్లు సాగించిన రియల్టర్లు, అపార్ట్‌మెంట్ల నిర్వాహకులపై ఇన్‌కమ్‌టాక్స్ నిఘా వేసిందని సమాచారం.

# నెల్లూరు 'దేశం'

(మొదటిపేజీ తరువాయి)

ఆయనకు సరిపోతుంది. జిల్లాకు సంబంధించి మంత్రిగా నారాయణ ఉన్నా కూడా పార్టీ కేడర్‌కు పనిచేయడంలోనూ, పార్టీకి వారి చేత పనిచేయించడంలోనూ నారాయణ సఫలం కాలేకున్నారు. అసలు ఆ దిశగా ప్రయత్నం కూడా చేయడం లేదు. మంత్రిగా నారాయణ జిల్లాలో పార్టీ పటిష్టతకు ఏ మాత్రం కృషి చేయడం లేదు. సరికదా ఆయన అవలంభిస్తున్న పోకడలు కూడా కార్యకర్తలకు మింగుడు పడడం లేదు. కాంగ్రెస్, వైకాపాల నుండి కొత్తవాళ్లను పార్టీలోకి తీస్తూ వాళ్లకు పెత్తనం అప్పగిస్తుండడం 'దేశం' శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి.

సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మొన్న ఎన్నికల్లో గెలిచుంటే పరిస్థితి ఓ రకంగా ఉండేది. ఆయన మంత్రి అయ్యుంటే పార్టీ కేడర్‌లో ఉత్సాహం ఉండేది. సోమిరెడ్డికి ఇప్పుడు ఎటువంటి పవర్ లేకపోవడం జిల్లాలో పార్టీకి, ముఖ్యంగా తమ సమస్యలు, పనులు మీద వచ్చే కార్యకర్తలకు పెద్ద లోటుగా కనిపిస్తుంది. ఒక ఎమ్మార్వోకో, ఎస్‌ఐకో ఫోన్ చేయించాలనుకుంటే మంత్రి దొరకరు. సోమిరెడ్డికి అధికారం లేదు. ఇక గెలిచిన ముగ్గురు ఎమ్మెల్యేలు వ్యాపారాల పరంగా బిజీగా ఉండేవాళ్లే! పూర్తిస్థాయిలో పార్టీపై దృష్టిపెట్టే అవకాశం వారికి లేదు. ఇక ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు కూడా తమ నియోజకవర్గాలలో పార్టీని చక్కదిద్దుకోలేకపోతున్నారు. గ్రామస్థాయిలో కూడా తెలుగుదేశం కార్యకర్తలు సరైన నాయకత్వం లేక సతమతమవుతున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు బీద రవిచంద్ర ఇంతవరకు భారంగానే పార్టీని లాగాడు. ఇంకా దానిని లాగడం ఆయనకు కష్టంగానే వుంది. పార్టీ అధికారంలోకి వచ్చింది కాబట్టి కనీసం ఇప్పుడైనా పదవి అనే పల్లకీని ఎక్కాలని ఆయన ఆశపడుతున్నాడు. జిల్లాలో తెలుగుదేశం పరిస్థితి అధ్వాన్నంగానే వుంది. అధికారం అనేది ఉండడం, ఇప్పట్లో ఎటువంటి ఎన్నికలు లేకపోవడంతో ఆ పార్టీకొచ్చిన నష్టమేమీ లేదు. కాని ఈ వాతావరణాన్ని సరిదిద్దుకుని, జిల్లాలో పార్టీ కేడర్‌కు అందుబాటులో వుండి సమాధానం చెప్పే ఒక నాయకత్వాన్ని అందించుకుంటే భవిష్యత్‌లో ఆ పార్టీకే ఇబ్బందిగా మారుతుంది.

# చిమ్మేసాడు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యంగా ఆ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించిన కిరణ్‌బేడీ కూడా ఓడిపోవడం ఆ పార్టీ శ్రేణులను కుంగదీసే అంశమే.

ఢిల్లీ ఎన్నికల ఫలితాల అనంతరం మీడియా కాని రాజకీయ నిపుణులు కాని రకరకాల విశ్లేషణలు చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి విజయగర్వం తల కెక్కిందని, రిపబ్లిక్‌డే నాడు 10లక్షల సూటు వేసుకున్నాడని, ఇలాంటి కారణాల తోనే ఆయన పట్ల ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని చెబుతున్నారు. పాలకుల డ్రెస్‌కోడ్ హుందాగా ఉంటే బాగుంటుందనేది వాస్తవమేగాని, ఫలానా డ్రెస్ వేసుకోవాలని ఎవరూ నిర్దేశించలేరు. ప్రతి వ్యక్తికి సొంతంగా కొన్ని అభిరుచులు, కోరికలు ఉంటాయి. మోడీకి వెరైటీ డ్రెస్ పిచ్చి ఉండొచ్చు. దానిని మనం తప్పు పట్టలేం. అయితే 10లక్షల సూటుకు ప్రభుత్వ ధనాన్ని వినియోగించి ఉంటే ఖచ్చితంగా తప్పు పట్టాల్సిందే!

ఢిల్లీ ఎన్నికల్లో ఒక విషయం స్పష్టంగా అర్ధమవుతుంది. బీజేపీ నాయకులు ఎటువంటి తప్పులు చేయకుండా ఈ ఎన్నికల్లో పోరాడి వున్నా 'ఆప్' విజయాన్ని ఆపగలిగేవారు కాదు. కాకపోతే 67సీట్లు రావు గాని పూర్తి మెజార్టీ వచ్చి ఉండేదే. దీనికి కారణం లేకపోలేదు. ఢిల్లీ ప్రజలు కాంగ్రెస్‌ను పూర్తిగా వదిలేసారు. బీజేపీకి పడని ఆ ఓటంతా ఆప్‌కే వెళ్లింది. ఇక బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఆప్ పార్టీ, అది కూడా సామాన్య ప్రజలకు దగ్గరగా వుండే అరవింద్ కేజ్రీవాల్ ప్రత్యామ్నాయంగా కనిపించాడు. 2013లో కాంగ్రెస్ మద్దతుతో ఆయన ఢిల్లీ సీఎంగా 49రోజులే పనిచేసినా, అక్కడి ప్రజలకు నిద్రలేస్తే సమస్యలుగా వున్న మంచినీళ్లు, కరెంట్ ఛార్జీలు వంటి సమస్యలను ఓ కొలిక్కి తెచ్చాడు. ఆయన నాయకత్వం పట్ల ప్రజల్లో ఆ రెండు పనులు విశ్వాసాన్ని రెట్టింపు చేశాయి. సీఎం పదవిని వదిలి పోయినందుకు ప్రజలకు ఆయన హుందాగా క్షమాపణ చెప్పారు. ఢిల్లీలోని ప్రతి గల్లీలోనూ ఆయన సభలు పెట్టి ప్రజలకు సారీ చెప్పుకుంటూ పోయాడు. భారతీయులది క్షమాగుణం. శత్రువులు సైతం క్షమించమని అడిగితే కనికరించే గుణం మనది. అరవింద్ కేజ్రీవాల్ అమాయకంగా అడిగేసరికి ఢిల్లీ వాసుల మనసులు కరిగిపోయాయి. ఢిల్లీ సీఎంగా రాజీనామా చేసిన రోజునుండి కూడా ఆయన రాజకీయాల నుండి పారిపోలేదు. మళ్ళీ ఢిల్లీ వీధుల్లో తిరుగుతూ ప్రజలను నిత్యం కలుసుకుంటూనే వున్నాడు.

'ఆప్' గెలుపుకు కేజ్రీవాల్ ఎంత కృషి చేసాడో, అంతకంటే ఎక్కువ కృషి బీజేపీ వాళ్లు చేశారు. 'ఆప్'కు 40సీట్లు వచ్చే వాతావరణం వుంటే దానిని 67సీట్లకు పోయే వాతావరణాన్ని కల్పించింది బీజేపీ నేతలే! సీనియర్లను పక్కపెట్టి అప్పటికప్పుడు పార్టీలో చేరిన కిరణ్‌బేడీని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు. ఈమధ్య జరిగిన మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్, జమ్మూ కాశ్మీర్ ఎన్నికల్లో ఆ పార్టీ ఆ పద్ధతిని అనుసరించలేదు. కాని ఢిల్లీలో కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. బహుశా మోడీ గాలి ఉధృతంగా వీస్తుందని బలంగా నమ్మడమే కారణం కావచ్చు. మోడీ ఇమేజ్ ముందు కేజ్రీవాల్ నిలవలేడని భావించారు. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలాగా మోడీ, అమిత్‌షా వంటి ఉద్దండులు కేజ్రీవాల్‌పై అరాచక వాది, నక్సలైట్ వంటి తీవ్ర పదాలతో విమర్శలు చేశారు. కేంద్రమంత్రులు, ఎంపీలు ఢిల్లీలో మోహరించారు. ఈ విమర్శలను ప్రజలు స్వాగతించలేదు. బీజేపీ అగ్రనేతలే ఎంతగా నోరు జారినా కేజ్రీవాల్ హుందాగా వ్యవహరించారు. ఢిల్లీలోని జామా మసీద్ ఇమామ్ పట్టాభిషేకానికి భారత ప్రధానిని పిలవకుండా పాకిస్తాన్ ప్రధానిని పిలిచినందుకు ఇమామ్ సయ్యద్ బుఖారి మద్దతును కూడా తిరస్కరించారు. భారత ప్రజాస్వామ్యం పట్ల తన నిబద్ధతను చాటుకున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే గౌరవ ప్రదమైన మాటలతో, హుందాకరమైన ప్రవర్తనతో కేజ్రీవాల్ తన స్థాయిని, తన పార్టీ స్థాయిని పెంచుకుంటే బీజేపీ అగ్రనేతలు మాత్రం కేజ్రీవాల్‌పై ఆమోదించని పదజాలంతో విమర్శలు చేసి తమ స్థాయే కాదు తమ పార్టీ స్థాయిని కూడా మూడు సీట్లకు దిగజార్చారు. 'ఆప్' విజయం కేవలం కేజ్రీవాల్‌దే కాదు, అందులో నరేంద్ర మోడీ, అమిత్‌షాలు కూడా పరోక్ష భాగస్వాములేనని చెప్పవచ్చు.

# నెల్లూరుదోమలపై ఇండియాకే పేటెంట్ హక్కు

శ్రీను గల్పిక 3

**జరిగిన కథ: భారత రిపబ్లిక్‌డే వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొనడానికి వచ్చిన అమెరికా అధ్యక్షుడు ఒబామా తనకు సెక్యూరిటీ లేకపోవడాన్ని చూసి ఆందోళనకు గురవుతాడు. అదే విషయాన్ని భారత ప్రధాని నరేంద్ర మోడీతో ప్రస్తావిస్తే ప్రపంచంలోనే ఎవరికీ కల్పించని అసాధారణ భద్రతను మీకు కల్పించామని చెబుతాడు. రిపబ్లిక్‌డే వేడుకలలో త్రివిధ దళాల విన్యాసాల అనంతరం నెల్లూరు బ్లడ్‌డెవిల్స్ ఫోర్స్ విన్యాసాన్ని చూసి ఒబామా ఆశ్చర్యపోతాడు. ఆ ఫోర్స్‌లో వున్న జీవులు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలని, నెల్లూరులో వాటి పుట్టుపూర్వోత్తరాలను ఒబామాకు వివరిస్తాడు మోడీ! ఈ దోమలతో ఇండియా తమ దేశాన్ని మించి పోతుందని ఒబామా మనసులో అనుకోసాగాడు...**

ఆ తర్వాత...

చైనా, పాకిస్థాన్ వంటి శత్రుదేశాలు మీ మీద దాడిచేస్తే ఈ నెల్లూరు బ్లడ్‌డెవిల్స్ ఫోర్స్ నేరుగా ఎదుర్కోగలదా? అని ఒబామా అడుగుతాడు. అప్పుడు మోడీ... ఈ ఫోర్స్ నేరుగా శత్రుసైనికుల మీద అటాక్ చేయదు. సరిహద్దుల్లో మా ఆర్మీ పోరాడుతుంటుంది. ఈ బ్లడ్‌డెవిల్స్ ఫోర్స్ మాత్రం శత్రుదేశాల్లోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాల లోకిపోతుంది. ఈ ఫోర్స్‌లోని దోమలు అక్కడ జనాన్ని తరిమితరిమి కరుస్తాయి. దాంతో అక్కడి వాళ్లు డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, మెదడువాపు వంటి అతి ప్రాణాంతక రోగాలబారిన పడతారు. ఇలా శత్రు సైనికుల కుటుంబసభ్యులు కూడా జబ్బుల వాత పడతారు. తమ కుటుంబసభ్యులు రోగాలతో అల్లాడుతుంటే సరిహద్దుల్లో సైనికులు ధైర్యంగా పోరాడలేరు. వారిలో తమ కుటుంబసభ్యులకు ఏమవుతుందోనన్న మానసిక ఆందోళన రేగుతుంది. శత్రు సైన్యం మొదట మానసికంగా బలహీన పడుతుంది. అదే అదనుగా మా సైన్యం విజృంభించి

## భారత్ - అమెరికాల మధ్య చారిత్రాత్మక ఒప్పందం

వారిని తరిమికొడుతుంది. ఆ విధంగా శత్రు దేశాలపై మేం విజయం సాధించగలమని చెప్పాడు. ఆ మాట వినగానే ఒబామా టక్కున మోడీ చేతులు పట్టుకుని ఇవి హ్యాండ్స్ కాదు లెగ్స్ అనుకోండి... మా దేశానికి అన్నీ ఉన్నాయి, కాని నెల్లూరు బ్లడ్‌డెవిల్స్ ఫోర్స్ వంటి శక్తివంతమైన ఫోర్స్ లేదు. దయచేసి ఓ 10టన్నుల నెల్లూరు దోమలను మీరిస్తే మేం వాటితో బలమైన సైన్యాన్ని తయారు చేసుకుంటాం. దీనికి ప్రతిఫలంగా ఏదడిగినా ఇస్తాం అని ప్రాధేయ పడసాగాడు. అందుకు మోడీ... ఇది మా ఒక్కరి చేతుల్లో విషయం కాదు, దీనిపై నెల్లూరు నాయకులతోనూ చర్చించాల్సి ఉందని చెప్పాడు. అలాగైతే వెంటనే నెల్లూరు పోదాం, అక్కడ ఎవరిని బ్రతిమలాడాలంటే వారిని నేను బ్రతిమలాడుకుంటాను అని ఒబామా అడిగాడు.

★★★★★

నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ అజీజ్ ఛాంబర్. ఒబామా, నరేంద్రమోడీ, అమెరికా విదేశాంగమంత్రి జాన్‌కెర్రీ, మన కేంద్రమంత్రులు మనోహర్ పారికల్, రాజ్‌నాథ్‌సింగ్, సుష్మాస్వరాజ్, యం.వెంకయ్యనాయుడులతో పాటు మేయర్ అజీజ్, కమిషనర్ చక్రధర్‌బాబు, కలెక్టర్ యం.సుజాత, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, మాజీఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి(64+), మాజీమేయర్‌లు శ్రీమతి భానుశ్రీ, శ్రీమతి పులిమి శైలజ, మాజీమున్సిపల్ ఛైర్మెన్‌లు అనూరాధ, రమేష్‌రెడ్డిలు ఉన్నారు. అందర్నీ ఉద్దేశించి మోడీ... ఒబామా గారు ఓ పది టన్నుల నెల్లూరు ముదురుదోమలు కోరుతున్నారు. ఆయన అతిథిగా మన దేశం వచ్చాడు. అతిథి ఏమడిగినా కాదనకుండా ఇవ్వాలనే సంస్కృతి మనది. మీరేమంటారు అని చెప్పాడు. ఆ మాట విని భానుశ్రీ, పులిమి శైలజ, అనూరాధలు కన్నీళ్లు పెట్టుకున్నారు. భానుశ్రీ అయితే... ఈ దోమలను సొంతబిడ్డలుగా పెంచాం సార్, ఇందులో మా అందరి కృషి వుంది. ఈరోజు వాటిని దేశం కాని దేశానికి పంపాలంటే మా మనసుకు కష్టంగా ఉంటుందని అంది. ఆ మాటకు రాజ్‌నాథ్‌సింగ్... మీ బిడ్డల్లాంటి వంటున్నారు, మీ సొంత బిడ్డలను చదువుల కోసం, ఉద్యోగాల కోసం అమెరికా పంపిస్తున్నారు కదా, వీటిని కూడా అలాగే అనుకోండి అని సముదాయించే ప్రయత్నం చేశాడు. కాని పులిమి శైలజ, అనురాధలు ఆ ప్రతిపాదనకు ముఖాలు మాడ్చుకుని కన్నీళ్లు పెట్టుకోసాగారు. మోడీ నెల్లూరు నాయకుల ముఖాల వైపు చూసాడు. వివేకా కళ్లకు నల్లద్దాలు పెట్టి ఆకాశంలోకి చూస్తున్నాడు. మోడీ వుండి... అమెరికాకు నెల్లూరు దోమలు సప్లయ్ చేయడం వివేకాకు సుతారం ఇష్టం లేనట్లుంది, ఆయన చాలా సీరియస్‌గా వున్నారు... ఏమంటారు వివేకా అని అడిగాడు. వివేకాలో చలనం లేదు. వెంకయ్యనాయుడుకు డౌటొచ్చి వివేకా కళ్ల మీదున్న నల్లద్దాలు తీసాడు. వివేకా కళ్లు మూసుకుని శుభ్రంగా నిద్రపోతున్నాడు. వెంకయ్య ఆయనను వివేకా... అంటూ పిలిచాడు. వివేకా ఉలిక్కిపడి లేచి... సారీ అన్నా, రాత్రి సెకండ్ షోకు వెళ్లాను, రాత్రి నిద్రలేక ఇప్పుడు నిద్ర పట్టేసిందన్నాడు. వెంకయ్య వుండి... అమెరికాకు నెల్లూరు దోమలు ఇచ్చే విషయమై నీ అభిప్రాయమేంటని అడిగాడు. ఓ పది టన్నులకైతే ఓకే... అంతకుమించి ఇచ్చేదానికి ఒప్పుకునేది లేదన్నాడు. అది విని జాన్‌కెర్రీ ఒబామాకు దగ్గరగా జరిగి... సార్, కేవలం 10టన్నులే ఇచ్చారంటే ఆ ఫోర్స్‌ను శాశ్వతంగా ఉంచలేం. ఎందుకంటే దోమల ఆయుష్షు కొద్ది రోజులే! కాబట్టి ప్రతినెలా రెండు టన్నులు తప్పని సరిగా మనకిచ్చేలా ఒత్తిడితెండి అని చల్లగా చెప్పాడు. దానికి ఒబామా... పిచ్చోడా... వీళ్లను ముందు 10టన్నులు కాదు, పది కిలోల దోమలను ఇవ్వనీ చాలు... వాటిని తీసుకెళ్లి మన ల్యాబ్‌లలో పరిశోధనలు జరిపించి, క్లోనింగ్ సిస్టమ్ ద్వారా వీటిని మించిన దోమలను సృష్టిస్తాం, నెల్లూరు దోమకణం మనకు దొరికితే చాలు... ఆ తర్వాత లక్షల టన్నుల దోమలను మనమే ప్రపంచ దేశాలకు అందిస్తాం. భారత్‌కు కూడా మనమే సప్లయ్ చేయగలుగుతామన్నాడు. ఆ మాటలు వివేకా విన్నాడు. వెంటనే వివేకా ప్రధానితో... సార్, వీళ్లకు మన దోమలు ఇవ్వడమంటే మన కళ్లు మనం పొడుచుకోవడమే అవుతుంది. వాళ్లు తర్వాత మనతోనే వ్యాపారం చేస్తారు... నా మాట విని ఈ దోమలను వాళ్లకిచ్చే సంగతి మరచిపోండి.. అని ఆవేశంగా అన్నాడు. అందుకు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఒప్పుకోలేదు. ఆయన మన అతిథి... ఆయన మణులు, మాన్యాలు అడగలేదు, మనకున్న దోమల్లో కొన్నింటిని దానం చేయమని కోరుతున్నాడు. ఇచ్చి మన దానగుణం నిరూపించుకుందామన్నాడు. అందుకు వివేకా... నీకు తెలియదు శ్రీధర్, వీళ్లు చాలా పెద్ద కుట్రపన్నుతున్నారు. మనమిచ్చిన దోమలతో మనతోనే వ్యాపారం చేయాలనుకుంటున్నారు. మన దోమలపై వాళ్ల బ్రాండ్ వేసుకోవాలనుకుంటున్నారు, కనీసం నెల్లూరు దోమలపై మనకే పేటెంట్ ఉండేలానన్నా ఒప్పందం చేయండని చెప్పాడు. ఒబామా అందుకు సరే ననడంతో పదిటన్నుల దోమల సరఫరాకు సంబంధించిన ఫైలుపై అమెరికా విదేశాంగ మంత్రి జాన్‌కెర్రీ, నెల్లూరు మేయర్ అజీజ్‌లు, సాక్షులుగా ఒబామా, మోడీలు సంతకాలు చేశారు. ఆ ఒప్పందం కుదరడంతో ఒబామా ముఖం వెయ్యి వోల్ట్ బల్బులా వెలగసాగింది. అందరూ ఛాంబర్ నుండి బయటకు రాసాగారు. మోడీకి అటు ఇటూ వివేకా, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు. ఒబామా, జాన్‌కెర్రీలు రహస్యంగా మాట్లాడుకున్న సంగతిని వివేకా మోడీకి చెప్పాడు. మోడీ వుండి... ఈ సంగతి నీకు తెలియదా శ్రీధర్, మన దోమలతో వాళ్లు వ్యాపారం చేస్తారని నువ్వు పసిగట్టలేదా? అమెరికాకు దోమలివ్వాల్సిందేనని గట్టిగా పట్టుబట్టావ్... మీరంతా వ్యతిరేకించి వుంటే నేను చేతులెత్తేసేవాణ్ణి... నువ్వు గట్టిగా పట్టుబట్టబట్టే ఈ ఒప్పందం కుదుర్చుకోవాల్సి వచ్చిందన్నాడు. అందుకు శ్రీధర్‌రెడ్డి తేలిగ్గా... సార్, ఇక్కడ ఆందోళన చెందాల్సిందిగాని, బాధపడాల్సింది గాని, భయపడాల్సింది గాని ఏమీ లేదు. నెల్లూరు దోమలను తీసుకెళ్లి అమెరికావాళ్లు ఏమీ చేసుకోలేరు. నెల్లూరు దోమలు నెల్లూరులో తప్పితే ఇంకెక్కడా జీవించలేవు. నెల్లూరులో లాగా అమెరికాలో మురికిగుంటలు, కాలువలు, చెత్తదిబ్బలు వుండవు, నెల్లూరులో లాగా అమెరికాలో వాటిని డెవలప్ చేయాలంటే వందల ఏళ్లు పడుతుంది. నెల్లూరులో కూడా ఒక్కరోజులో ఈ దోమలు అభివృద్ధి చెందలేదు. ఇక్కడున్న అందరి కృషి అందులో వుంది. ఒబామా ఇప్పుడు తీసుకెళ్లే 10టన్నుల దోమలు పులుసు కాసుకోడానికి తప్ప ఆర్మీఫోర్స్‌కు పనికిరావని చెప్పాడు. ఆ మాటతో మోడీ, వివేకాల మనసులు కుదుటపడ్డాయి.

**(అయిపోయింది)**

## కదంబం

### రుతువు మొదలవుతుంది

**ఆశారాజు,**
**హైదరాబాద్. 9392302245**

ఎంత మృదువుగా వుంటారు పిల్లలు – !
దూదిలానా పట్టులానా
పూలరెమ్మల్లానా పక్షి ఈకల్లానా –
లేక, ఆడిస్తున్న తల్లి మురిపెంలానా!

ముద్దు పెట్టుకుంటే
చందమామ సిగ్గుపడుతుంది
పెదాలు తాకితే
నెమలి పింఛం విచ్చుకుంటుంది
ముసిముసిగా బుగ్గను హత్తుకుంటే
'బెలూన్'లా వొత్తుకుంటుంది
చిన్నపిల్లలను ముద్దాడితే
ఇంద్రధనుస్సు వెలస్తుంది

పిల్లల్ని ఎత్తుకోవడమంటే
చేతుల నిండా ప్రేమను పట్టుకోవడం
పిల్లలు చంకలో వున్నంత సేపు
మనసులో మంచు బిందువు దొర్లుతుంది
నవ్వులు కదిలే కన్నుల్లో
బతుకు చిగిర్చే రుతువు మొదలవుతుంది

(బేబి 'వహలి'ని ఎత్తుకొన్నప్పుడు)

## ఇనాక్‌కు ఈదూరు సుబ్బయ్య పురస్కారం



ప్రముఖ సాహితీవేత్త, విశ్రాంత నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి పద్మశ్రీ డాక్టర్ కొలకలూరు ఇనాక్(హైదరాబాద్)కు ఈదూరు సుబ్బయ్య సాహితీ పురస్కారాన్ని నెల్లూరు దర్గామిట్ట ఐయంఏ హాలులో ఈ నెల 15వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు ప్రదానం చేస్తున్నట్లు పురస్కార కమిటి కార్యదర్శి డాక్టర్ ఈదూరు సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరుజిల్లా జాయింట్‌కలెక్టర్ ఇంతియాజ్, పలువురు సాహితీవేత్తలు పాల్గొంటారని తెలిపారు. పురస్కారంతో పాటు రూ.10వేల నగదు, జ్ఞాపికను అందజేస్తున్నట్లు తెలిపారు.

## జాతీయ సదస్సు

తిరుమల తిరుపతి దేవస్థానములు, శ్రీ వెంకటేశ్వర ఓరియంటల్ డిగ్రీ మరియు పిజి కళాశాల హిందీ విభాగం వారు హిందీ, తెలుగు, సంస్కృత భాషా విభాగాలలో 'రామ కథ – సాహిత్యం, జీవితం– కళలు' అనే అంశం మీద నిర్వహించిన రెండురోజుల జాతీయ సదస్సులో నెల్లూరు బి.వి. నగర్‌లోని కె.యన్.ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు గుండాల నరేంద్రబాబు "రామకథ – జీవిత విలువలు" అంశంపై పత్ర సమర్పణ చేశారు.

ఎన్.బి.కె.ఆర్ ఆర్ట్స్ సైన్స్ కళాశాల తెలుగుశాఖ ప్రొఫెసర్ డా॥ టి.మాలకొండయ్య, కవి పెళ్లూరు సునీల్(కోట) పత్ర సమర్పణ చేసి పలువురి అభినందనలు పొందారు. డా॥ ఆర్.పురంధరేశ్వరి, ఎం.రామనాథం, ఇ.జి. హేమంత్‌కుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించబడింది.

## సార్క్ దేశాల రచయితల సదస్సుకు పెరుగు దంపతులు

ఈ నెల 13నుండి 16వరకు ఆగ్రాలో జరగనున్న సార్క్ దేశాల రచయితల సదస్సుకు హాజరు కావాల్సిందిగా ప్రముఖ కవి దంపతులు పెరుగు రామకృష్ణ–సుజనా రామంలకు ఆహ్వానం అందింది. ఫౌండేషన్ ఆఫ్ సార్క్ రైటర్స్ అధినేత్రి పద్మశ్రీ అజీత్‌కౌర్ ఈమేరకు పెరుగు దంపతులకు ఆహ్వానం పంపారు. సరిహద్దులకు అతీతంగా ప్రాంతాల మధ్య వెల్లి విరవాల్సిన స్నేహ సంబంధాలు, శాంతి అనే నేపథ్య అంశంపై పాత్రా సమర్పణలు, కవిత్వగానాలు, సార్క్ దేశాలకు చెందిన పలువురు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలతో మూడురోజుల పాటు అందాల తాజ్ నగరం ఆగ్రాను అలరించనుంది. కాగా పెరుగు దంపతులు ఈ సదస్సులో కవితలు సమర్పించనున్నారు.

## 20న "ప్రతిజ్ఞాపాలనము"

నెల్లూరులోని శ్రీ పెళ్ళూరు పట్టాభిరామిరెడ్డి స్మారక థార్మిక ట్రస్టు కళాపరిషత్ వారు నిర్వహిస్తున్న 7వ స్మారకోత్సవ ఉచిత పద్యనాటక ప్రదర్శనల్లో భాగంగా ఈ నెల 20వ తేదీ శుక్రవారం టౌన్‌హాల్‌లో సాయంత్రం 7గంటలకు మధురకవి బిరుదవోలు రామిరెడ్డి రచించిన "ప్రతిజ్ఞా పాలనము"(కురుక్షేత్రము) పౌరాణిక పద్యనాటకాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇందులో స్థానిక కళాకారులు నటిస్తున్నారు. పర్యవేక్షణ వల్లకవి వేంకటసుబ్బారావు పంతులు, నిర్వహణ టి.వి.రమణారావు, దర్శకత్వం పొన్నాల రామసుబ్బారెడ్డి నిర్వహిస్తున్నారు. సంగీతం జి.రామకృష్ణ, రంగాలంకరణ హైదరాబాదు వి.ఉమాశంకర్ సురభి, ఆహార్యం వి.లక్ష్మీకాంతం సహకరిస్తున్నారు. 21వ తేదీ శనివారం సాయంత్రం 7గంటలకు గయోపాఖ్యానం యుద్ధసీను, 22వ తేదీ ఆదివారం సాయంత్రం 7గంటలకు శ్రీరామాంజనేయయుద్ధసీను నిర్వహిస్తున్నారు. ఈ మూడురోజులు ఉదయం ఏకపాత్రలు, లలిత సంగీతం, శాస్త్రీయసంగీతం, నృత్య పోటీలు, పద్యగాన పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలకు సింహపురి సంగీతాభిలాషులు విచ్చేసి జయప్రదం గావించాలని మేనేజింగ్ ట్రస్టీ పెళ్ళూరు సుధాకరరెడ్డి కోరుతున్నారు.

# ముక్కోటి దేవతల సాక్షిగా... రాజీవ్ - కావ్యల కళ్యాణం
















**2015 ఫిబ్రవరి 5వ తేదీ రాత్రి హైదరాబాద్ సంబరాల ప్రపంచంలోనే ఓ మరపురాని రోజు. ఆకాశమే పందిరిగా కళ్లు మిరమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణల మధ్య సాక్షాత్తూ దేవలోకమే భూలోకంలో వెలసిందా అన్న స్థాయిలో జరిగిన ఏర్పాట్ల నడుమ తిక్కవరపు సుబ్బరామిరెడ్డి - శ్రీమతి ఇందిరమ్మల ముద్దుల మనుమడు సంజయ్‌రెడ్డి, సరితల గారాల కుమారుడు రాజీవ్ కళ్యాణం కుమారి కావ్యతో కన్నుల పండువగా జరిగింది.**

బాలీవుడ్, టాలీవుడ్, కోలివుడ్ అన్న తేడా లేకుండా యావత్ సినీరంగ ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావులతో పాటు రెండు రాష్ట్రాల మంత్రివర్గం దాదాపుగా ఈ పెళ్ళికి పెద్దలయ్యారు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన బడా పారిశ్రామికవేత్తలు సైతం రెక్కలు కట్టుకుని హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో వాలిపోయారు.

సాయంత్రం 6.30గంటలకు ఈ వేడుక మొదలుకాగా తెల్లవారుఝాము వరకూ కొనసాగుతూనే వుండింది. అయితే అన్ని గంటల సేపు జరిగిన ఈ కార్యక్రమంలో ఎక్కడా అలసట అన్నది కనపడకుండా పెళ్లికి వచ్చిన ప్రతివారినీ పలకరిస్తూ సుబ్బరామిరెడ్డి, జి.వి.కె కుటుంబసభ్యులు తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు.

వందల రకాలతో ఏర్పాటు చేసిన విందు వంటకాలతో పాటు హేమమాలిని బృందం చేసిన నృత్యాలు, శంకర్ మహదేవన్ అందించిన సంగీత సౌరభాలు హైటెక్స్ ప్రాంగణాన్ని కోలాహలంతో ముంచెత్తాయి. అతి భారీస్థాయిలో వేసిన మండపం సెట్లు నభూతోనభవిష్యత్‌లా నిలిచాయి.

ఎక్కడ ఆర్భాటం వుంటే, ఎక్కడ ఆడంబరం వుంటే, ఎక్కడ ఆకాశాన్నంటే సంబరం వుంటే, ఎక్కడ ఆత్మీయత వుంటే... అక్కడ సుబ్బరామిరెడ్డి వుంటాడన్న నానుడిని టి.యస్.ఆర్. మరోసారి రుజువు చేసుకున్నాడు.

సుబ్బరామయ్యకు 'లాయర్' అభినందనలు.

నూతన దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.
















Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com